ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
మంగళవారం 7 జనవరి 2025



భీమడోలులో గన్ని వీరాంజనేయులును అభినందిస్తున్న కార్యకర్తలు, నాయకులు

రండి ఆప్కాబ్ చైర్మన్ గారు..

గన్నికి.. మంత్రి లోకేశ్ పిలుపు

భీమడోలు, జనవరి 6(ఆంధ్రజ్యోతి):టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులును ఆప్కాబ్ చైర్మన్ పదవి వరించబోతోందన్న సంకేతాలు వెలువడుతున్నాయి. పశ్చిమ గోదావరి జిల్లా ఉండి నియోజకవర్గంలో సోమవారం పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మంత్రి నారా లోకేశ్ వెళ్లారు. ఈ సందర్భంగా స్వాగతం పలికేందుకు వెళ్ళిన గన్నిని చూసి 'రండి ఆప్కాబ్ చైర్మన్ గారు' అంటూ లోకేశ్ పలకరించడం చర్చనీయాంశంగా, వైరల్‌గా మారింది. ఆప్కాబ్ చైర్మన్‌గా ఆయనను నియమిస్తున్నట్టు ఇచ్చిన సంకేతాల నేపథ్యంలో ఉంగుటూరు నియోజకవర్గంలో పార్టీ కేడర్, పార్టీ శ్రేణులు, నేతలు, సంబరాలు జరిపారు. గన్నిని పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు.

కొవిడ్‌తో మరణిస్తే.. పీఎం కేర్ స్కీమ్‌లో నమోదు చేయాలి

ఏలూరు క్రైం, జనవరి 6(ఆంధ్రజ్యోతి):జిల్లాలో 2020 మార్చి 11 నుంచి 2023 మే 5వ తేదీ మధ్య కాలంలో కొవిడ్ కారణంగా తల్లిదండ్రులను కోల్పోయిన 18 ఏళ్ల లోపు బాల బాలికలు పీఎం కేర్ స్కీములో నమోదు చేసుకోని వారు ఎవరైనా ఉన్నట్లయితే వెంటనే సదరు వెబ్‌సైట్ జ్ట్టిఇట//ఇరుచ్చిట్ప టజౌటచిజిజీజూఛీటు. జీలో నమోదు చేసుకోవాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారత అధికారి పి.శారద సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమాచారం కోసం 08812-249883 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

డ్రోన్‌ల సాయంతో శాంతి భద్రతల పరిరక్షణ : ఎస్పీ



ఏలూరు క్రైం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరి జ్ఞానంతో ఉన్న డ్రోన్ ద్వారా ప్రజా భద్రతను మెరుగుపర్చడానికి వినియోగించవచ్చని ఎస్పీ కేపీఎస్ కిశోర్ అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో మినీ డ్రోన్ సమ్మిట్‌ను ఎస్పీ ప్రారంభించి మాట్లాడారు. డ్రోన్‌ను పనితీరును పరిశీలించారు. జేసీ ధాత్రి రెడ్డి, నగరపాలక సంస్థ అధికారులు, అటవీశాఖ, అగ్ని మాపక, రవాణా, పోలీసు శాఖ అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధే అజెండా

సామాన్య కార్యకర్తలకు పెద్ద పీట : మంత్రి లోకేశ్

- ఉండి హైస్కూల్ భవనం ప్రారంభం
- పారిశ్రామికవేత్త టాటా విగ్రహావిష్కరణ
- ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు హితబోధ
- పార్టీ శ్రేణులు ప్రజలకు అందుబాటులో ఉండాలి
- నెల రోజుల్లో నామినేటెడ్ పోస్టులు భర్తీ.. ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నాం..



ఉండిలో హైస్కూల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి లోకేశ్.. చిత్రంలో మంత్రి నిమ్మల, డిప్యూటీ స్పీకర్ రఘురామ, కైకలూరు ఎమ్మెల్యే కామినేని, పశ్చిమగోదారి జిల్లా కలెక్టర్ నాగరాణి తదితరులు

(భీమవరం/రూరల్/టౌన్/ఉండి/కాళ్ల-ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం, ఉండి నియోజకవర్గాల్లో పర్యటన విజయవంతమైంది. పర్యటన ఆద్యంతం సందడిగా రాజకీయాలకతీతంగా మంత్రి పర్యటన సాగింది. తొలుత ఉండి జడ్పీ హైస్కూల్‌లో పునఃనిర్మించిన భవనాన్ని ప్రారంభించి చిన్నారులతో ముచ్చటించారు. విద్యార్థుల హాజరు తక్కువగా ఉండడంపై ఉపాధ్యాయులతో ప్రస్తావించారు. మంచినీటి సౌకర్యం లేక పిల్లలు అనారోగ్యం బారినపడి పాఠశాలకు రావడం లేదంటూ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లారు. విద్యార్థులు ఎలా చదువుతున్నారు. ఉపాధ్యాయులు ఏ విధంగా చెబుతున్నారు తదితర విషయాలను వారిని అడిగి తెలుసుకున్నారు. తల్లిదండ్రులు కష్టపడి చదివిస్తున్నారు. అందుకు తగిన విధంగా చదువుకోవాలని సూచించారు. మాదక ద్రవ్యాలకు దూరంగా వుండాలని అవి ఎంతో ప్రమాదకరమన్నారు. పాఠశాల ఆవరణలో రూ.18 లక్షలతో నిర్మించిన సీసీ రహదారిని ప్రారంభించారు. సెటిల్ కోర్టులను, పాఠశాల భవనాన్ని ప్రారంభించారు. స్థానిక మహిళలు లోకేశ్‌ను చూస్తూ కేకలు వేయడంతో పాఠశాల గోడ వద్దకు వచ్చి వారి నుంచి వినతి పత్రం తీసుకున్నారు. 'కూటమి ప్రభుత్వం ఒక్కొక్క హామీని నెరవేరుస్తోంది. పెన్షన్ పెంచాం. ఉచిత సిలిండర్‌లు అందజేస్తున్నాం. త్వరలో తల్లికి వందనం ఇస్తామ'ంటూ వారికి భరోసా ఇచ్చారు.

టాటా విగ్రహావిష్కరణ

అనంతరం పెద అమిరంలోని రతన్ టాటా కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించి, ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన సభలో విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. రతన్‌టాటా వంటి గొప్ప వ్యక్తులను విద్యార్థులు, యువత ఆదర్శంగా తీసుకోవాలని కర్తవ్యబోధ చేశారు. ఉండి నియోజకవర్గం ఎప్పుడూ మా గుండెల్లో ఉంటుంది. ఏ రోజూ మరచిపోలేం. అంతగా మమల్ని ఆదరించింది. ఇప్పుడు రఘురామకృష్ణరాజుకు అండగా నిలిచింది. ఆర్‌ఆర్‌ఆర్ అంటే ఏమిటో తెలుసా.. రియల్, రెస్పాన్స్‌బిలిటీ, రెబల్. చంద్రబాబు అరెస్ట్ తర్వాత ఫోన్ చేసిన తొలి పది మందిలో రఘురామ ఒకరు. ధైర్యం చెప్పారు. ఢిల్లీలో ఉన్నప్పుడు నాతో వెన్నంటి ఉన్నారు. ప్రతిపక్షంలో అప్పుడు ఉన్నా ఎంపీగా ఉన్న ఆయన కోర్టులో ఏమి చేయాలో సలహాలు, సూచనలు ఇచ్చారు. ఇప్పుడు ఎమ్మెల్యేగా గెలిచి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు. దాతలను సమీకరించి కాలువలు, డ్రెయిన్‌లు బాగు చేస్తున్నారని ఆర్ఆర్ఆర్‌ను కొనియాడారు. విద్యార్థులతో సభ ముగిసిన అనంతరం రఘురామకృష్ణరాజు నివాసానికి వెళ్లి, విందు స్వీకరించారు.

హంగూ ఆర్భాటాలు వద్దు

లక్ష రూపాయలతో శాశ్వత సభ్యత్వం తీసుకున్న ఉత్తమ కార్యకర్తలతో లోకేశ్ సమావేశమయ్యారు. పార్టీ పదవుల్లో సామాన్యులకు పెద్దపీట వేస్తామని భరోసా ఇచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని పేర్కొన్నారు. నాయకుల పర్యటనల్లో ఎటువంటి హంగు, ఆర్భాటాలు వద్దు. అహంకారం, విచ్చలవిడితనాన్ని ప్రజలు అంగీకరించరు. జగన్ హయంలో జరిగిన విధ్వంసం వలన రాష్ట్రానికి తీవ్ర నష్టం కలిగింది. ఇచ్చిన ప్రతి హామీని క్రమపద్ధతిలో అమలు చేస్తున్నాం. మనల్ని ప్రశ్నించే హక్కు జగన్ కు లేదు. కార్యకర్తల ఆరోగ్యం కోసం, వారి పిల్లల ఉద్యోగాల కోసం పార్టీ కార్యాలయం ద్వారా సాయం అందించేలా ఒక కార్యక్రమం రూపొందిస్తున్నాం. నెల రోజుల్లో అన్ని నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తాం. గత ఐదేళ్లు క్షేత్రస్థాయిలో పనిచేసిన వారికే ప్రాధాన్యతనిస్తాం. గ్రామస్థాయి కార్యకర్త పొలిట్ బ్యూరో స్థాయికి తీసుకెళ్లేలా ఒక ఆలోచన చేస్తున్నాం. అంద రూ ఒప్పుకుంటే దానిపై నిర్ణయం తీసుకుంటాం. రెండు పర్యాయాలు ఒక పదవి చేసిన తరువాత పైకి అయినా వెళ్ళాలి లేదా ఉన్న పదవి నుంచి పైదొలగి ఒక టర్మ్ ఖాళీగా అయినా ఉండాలి. ఆ మేరకు పార్టీ నిర్ణయం తీసుకుంటే నేను, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు వచ్చే విడత పదవి తీసుకోకుండా సామాన్య కార్యకర్తలుగా పార్టీ కోసం పనిచేయాల్సి ఉంటుంది' అని అన్నారు. ఆయన వెంట కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు, శాసన సభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, పీఏసీ చైర్మన్ పులపర్తి రామాంజనేయులు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, ఏపీఎస్‌సీపీసీ చైర్‌పర్సన్ పీతల సుజాత, ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, మద్దిపాటి వెంకట్రాజు, సొంగా రోషన్ కుమార్, బడేటి రాధాకృష్ణ(చంటి), పత్సమట్ల ధర్మరాజు, బొలిశెట్టి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ సి.నాగరాణి, ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, జెసి రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఈవో నారాయణ, హెచ్ఎం వై.రామలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, టీడీపీ ఇన్‌చార్జ్ వలవల బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

ఆంక్షలతో అసహనం..

లోకేశ్ పర్యటనలో పోలీసులు పలు ఆంక్షలు విధించారు. ఉండి హైస్కూల్‌లోకి మీడియా వెళ్లకుండా అడ్డు తగిలారు. లోకేశ్ పాఠశాలలోకి వెళ్లిన తర్వాత మీడియాకు అనుమతించారు. రఘురామకృష్ణరాజు నివాసం వద్ద పాస్‌లు ఉన్న కార్యకర్తలకు లోపలికి విడచిపెట్టలేదు. వారు అసహనానికి గురయ్యారు. మీడియాను అనుమతించలేదు.



కేంద్రమంత్రికి పరామర్శ

కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మను మంత్రి లోకేశ్ పరామర్శించారు. శ్రీనివాస్‌వర్మ తండ్రి సూర్యనారాయణరాజుకు నివాళులర్పించారు. అనంతరం కూటమి నాయకులు, శ్రేణులతో సమావేశమయ్యారు. బూత్ స్థాయి నుంచి జాతీయస్థాయి వరకు నేతలంతా అప్రమత్తంగా ఉండాలని కోరారు. సైకో జగన్ కుయుక్తులను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం రోడ్డు మార్గంలో విజయవాడ పయనమయ్యారు.



పార్టీ సమావేశంలో మాట్లాడుతున్న లోకేశ్



ఉండి హైస్కూల్‌లో షటిల్ కోర్టును విద్యార్థినులతో ప్రారంభిస్తున్న లోకేశ్..

125 కాదు.. 80 కిలోలే!

- పత్తి తూకంలో మోసం.. వ్యాపారికి దేహశుద్ధి

చాట్రాయి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): తూకంలో మోసం చేస్తున్న పత్తి వ్యాపారికి రైతులు దేహశుద్ధి చేసిన ఘటన చాట్రాయి మండలం పర్వతాపురంలో సోమవారం జరిగింది. తెలంగాణకు చెందిన ముగ్గురు పత్తి వ్యాపారులు పర్వతాపురంలో చొప్పరపు బజారుకు వచ్చారు. రైతుల వద్ద పత్తిని కొనుగోలు చేసి, వారి వెంట తెచ్చిన ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్‌తో కాటా వేస్తున్నారు. వ్యాపారుల్లో ఒకరు తన వద్ద ఉన్న రిమోట్‌తో ఎవరికి అనుమానం రాకుండా ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్‌ను ఆపరేట్ చేస్తున్నట్టు ఓ యువకుడు గమనించి రైతులకు చెప్పాడు. దీంతో వేరే వేయింగ్ మిషన్ తెచ్చి కాటా వేయగా వ్యాపారి 80 కిలోలు చెప్పిన బోరెం 125 కిలోలు ఉంది. దీనికి ఆగ్రహం చెందిన రైతులు ఒక వ్యాపారిని పట్టుకొని దేహశుద్ధి చేస్తుండగా మరో ఇద్దరు వ్యాపారులు పరారయ్యారు. తర్వాత వ్యాపారి తప్పు జరిగింది క్షమించమని వేడుకోవటంతో రూ.20 వేలు జరిమానా వసూలు చేసి వదిలేశారు.

జిల్లాలో సదరం సర్టిఫికెట్ల పరిశీలన

ఏలూరు క్రైం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో ఎన్టీఆర్ భరోసా దివ్యాంగుల సదరం సర్టిఫికేషన్ పరిశీలనను సోమవారం ప్రారంభించారు. ప్రభుత్వం పరిశీలనకు కేటాయించిన గుంటూరు, విజయవాడ, ఒంగోలు నుంచి ప్రభుత్వ డాక్టర్‌లు పరిశీలన ప్రక్రియ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వీరు మూడు బృందాలుగా విడిపోయి దెందులూరు మండలంలోని కొవ్వలి, సోమవరప్పాడు, దెందులూరు గ్రామాల్లో 60 మంది పింఛన్‌దారుల ఇళ్లకు వెళ్ళి వారి అర్హతను పరిశీలించారు. డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ విజయరాజు, డీసీహెచ్ఎస్ సతీష్, ఎంపీడీవో శ్రీదేవి పర్యవేక్షించారు.



దివ్యాంగుడితో మాట్లాడుతున్న వైద్యబృందం



జగనన్న కాలనీ భూమిలో సాగుకు సన్నాహాలు

సాగులోకి.. జగనన్న కాలనీ!

- జానంపేటలో 143 మందికి ఇళ్ల స్థలాలు
- మెరక చేయించేందుకు రూ.40 లక్షల వ్యయం
- అయినప్పటికీ నిర్మాణాలకు లబ్ధిదారుల వెనుకడుగు
- ఈ భూమి తనదేనంటూ ఓ వ్యక్తి సాగుకు సన్నాహాలు
- ఇళ్ల సరిహద్దు రాళ్ల తొలగింపు.. బాధ్యులపై చర్యలు : తహసీల్దార్

పెదవేగి, జనవరి 6(ఆంధ్రజ్యోతి):పేదల సొంతింటి కలను నిజం చేస్తామంటూ వైసీపీ ప్రభుత్వ హయాంలో లబ్ధిదారులను ఎంపిక చేసి, ఇళ్ల పట్టాలు ఇచ్చారు. వారి కోసం క్వారీ భూమిలో ఐదెకరాలు కేటాయించారు. ఆ భూమి అప్పటికే గ్రావెల్ తవ్వకాలతో పక్కనే ఉన్న రహదారికి 20 అడుగులకుపైగా లోతులో ఉంది. ఆ గోతుల్లోకి వెళ్లి మేము ఇళ్లు కట్టుకోమని లబ్ధిదారులు వెనకడుగు వేయడంతో దానిని మెరకచేయడానికి లక్షలు ఖర్చుచేసినా ఎవరూ ఇళ్లు కట్టుకో లేదు. తీరా ఇప్పుడు ఓ వ్యక్తి ఆ భూమి తనదేనని, పట్టా కూడా ఉందంటూ సాగుకు సన్నాహాలు చేస్తున్నారు. పెదవేగి మండలం జానంపేటలో జరుగుతున్న ఈ తతంగం అందరూ నోరెళ్లబెడుతున్నారు. వివరాల్లోకి వెళితే.. జానంపేటలో ఆర్ఎస్ నంబర్ 149లో 170 ఎకరాల క్వారీ భూమి ఉంది. అందులో 12 ఎకరాలలో ప్రకాష్ నగర్ కాలని, ఐదు ఎకరాల్లో టెస్ట్ డ్రైవింగ్ కోసం ఇచ్చారు. దానిని ఆనుకుని 149 -1/2లో సర్వే నంబర్ లో ఐదెకరాల భూమిని గత వైసీపీ ప్రభుత్వం జగనన్న కాలనీ పేరుతో ఇళ్ల స్థలాలకు కేటాయించి, సర్వే రాళ్ళు వేసి, 143 మందికి ఇళ్ళ ప్లాట్లను ఏర్పాటు చేసింది. ఏలూరు-చింతలపూడి ప్రధాన రహదారి పక్కన ఉన్న ఆ స్థలం రహదారికి 20 అడుగులకుపైగా లోతులో ఉంది. దీంతో లబ్ధిదారులు ఆ స్థలంలో ఇళ్ల నిర్మాణాలకు ముందుకురాలేదు. దీంతో రూ.40 లక్షలు వ్యయం చేసి, రెండు దశల్లో కొంత మేర మెరక చేశారు. అయినా ఇంకా 15 అడుగులకుపైగా లోతు ఉండడంతో ఒక్క లబ్ధిదారుడు ఇంటి నిర్మాణానికి ముందుకు రాలేదు.

అప్పుడు ఆక్రమించారు : మధుసూదన్

ఈ నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన తమ్మిశెట్టి మధుసూదనరావు అనే వ్యక్తి నాలుగు రోజులుగా ఆ భూమిలోని సరిహద్దు రాళ్లను తొలగించి, సాగుకు సన్నాహాలు చేస్తున్నాడు. కాలనీ కోసం కేటాయించిన భూమి అంచు నుంచి ఎక్స్‌కవేటర్‌తో గట్టు ఏర్పాటు చేశారు. ఆపై క్వారీలోని నీటిని ఆయిల్ ఇంజన్‌తో తోడి, కాలనీ స్థలాన్ని తడిపి, సోమవారం మొక్కలు నాటడం ప్రారంభించారు. జగనన్న కాలనీలో సాగుకు సన్నాహాలు చేయడంపై మధుసూదనరావును ప్రశ్నించగా ఇది తన తండ్రికి ప్రభుత్వం ఇచ్చిన భూమి అని, పట్టా కూడా ఉందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఇళ్ళ స్థలాలు ఇచ్చారు కదా అని అడుగగా.. ఆ రోజున వైసీపీ నాయకులు దౌర్జన్యంగా ఆక్రమించుకుని పట్టాలు ఇచ్చారని చెప్పారు. గ్రామస్థులు మాత్రం ఇది ప్రభుత్వ క్వారీ భూమి అని చెబుతున్నారు.

కాగా ఈ క్వారీ భూమిని మెరక చేయడానికి ప్రభుత్వ సొమ్ము రూ.40 లక్షలు ఖర్చు చేశారని, ఇప్పుడు ప్రభుత్వ ధనం వృథాగా పోయినట్లేనా, దీనిపై అధికారులు చర్యలేమీ తీసుకోరా అంటూ గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. జగనన్న కాలనీలో సరిహద్దు రాళ్ళను తొలగించి మొక్కలు వేస్తున్నారనే సమాచారంతో మొక్కలు వేయడాన్ని నిలుపుదల చేయించామని తహసీల్దారు ఎస్డీ భ్రమరాంబ చెప్పారు.

దీనిపై జానంపేటకు చెందిన వ్యక్తి తమ్మిశెట్టి రాజారావు కోర్టులో దావా వేయగా దానిపై యధాతథ స్థితి (స్టేటస్‌కో)ని కొనసాగించాలని కోర్టు ఆదేశించిందని తెలిపారు. సరిహద్దు రాళ్ళను వేసి, లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చి స్థలాలను కేటాయించారని, సరిహద్దు రాళ్ళను తొలగించడం నేరమని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

16,37,555



జిల్లాలో ఓటర్ల సంఖ్య ..

తుది ఓటర్ల జాబితా విడుదల

- పురుష ఓటర్లు 7,99,293 మంది
- మహిళా ఓటర్లు 8,38,146 మంది
- థర్డ్ జెండర్ ఓటర్లు 126 మంది
- సర్వీస్ ఓటర్లు 678 మంది

ఏలూరుసిటీ, జనవరి 6(ఆంధ్రజ్యోతి):భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక సంక్షిప్త సవరణ -2025 షెడ్యూలు ప్రకారం ఏలూరు జిల్లాకు సంబంధించిన తుది ఓటర్ల జాబితాను సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెట్రిసెల్వి విడుదల చేశారు. నియోజకవర్గాల వారీగా మొత్తం ఓటర్లు, సర్వీస్ ఓటర్ల వివరాలు అందులో పొందుపర్చారు. జిల్లాలో మొత్తం 16,37,555 మంది ఓటర్లు ఉండగా ఇందులో పురుష ఓటర్లు 7,99, 283 మంది, మహిళా ఓటర్లు 8,38,146 మంది ఉన్నారు. ఇవిగాక జిల్లాలో థర్డ్ జెండర్ ఓటర్లు 126 మంది కాగా సర్వీసు ఓటర్లు 678 మంది ఉన్నారు. జిల్లాలో తుదిఓటర్ల జాబితా పరిశీలిస్తే పురుష ఓటర్లకంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు.

నియోజకవర్గాల వారీగా ఓటర్లు వివరాలు

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	థర్డ్‌జెండర్ ఓటర్లు	సర్వీస్ ఓటర్లు
ఉంగుటూరు	206506	101586	104914	6	193
దెందులూరు	224507	109181	115318	8	101
ఏలూరు	234526	112032	122447	47	115
పోలవరం	254351	122961	131381	9	68
చింతలపూడి	272917	134171	138705	41	72
నూజివీడు	238933	118055	120868	10	50
కైకలూరు	205815	101297	104513	5	79
మొత్తం	1637555	799283	838146	126	678



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి

గడువులోగా అర్జీల పరిష్కారం : కలెక్టర్

ఏలూరు రూరల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా అందిన అర్జీలను గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పి.జి.ఆర్.ఎస్‌లో కలెక్టర్‌తోపాటు జేసీ ధాత్రిరెడ్డి, డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, ఆర్డీవో అచ్యుత అంబరీష్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.భాస్కర్ 276 అర్జీలు స్వీకరించారు. అర్జీలను ఆయా శాఖల అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.

ఏపీకే యాప్‌లను ఓపెన్ చేయవద్దు


ఏలూరు క్రైం : సంక్రాంతి పండుగ సందర్భంగా కొంత మంది సైబర్ నేరగాళ్లు ఎదుటి వారికి గ్రీటింగ్స్ తెలపాలంటే ఈ ఏపీకే యాప్‌లను వాడితే మీ ఫొటోతో కూడుకున్న శుభాకాంక్షలు ఎదుటి వారికి తెలపవచ్చని చెప్పి వచ్చే లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏఎస్పీ సూర్యచంద్రరావు సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో 25 మంది ఫిర్యాదుదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు.

జీతాలు, పీఎఫ్ చెల్లించకపోతే..

24 నుంచి ప్రభుత్వాస్పత్రుల్లోని పారిశుధ్య కార్మికులు సమ్మెబాట

ఏలూరు క్రైం, జనవరి 6(ఆంధ్రజ్యోతి):జిల్లాలోని ప్రభుత్వాస్పత్రుల్లో పనిచేసే పారిశుధ్య కార్మికులకు కాంట్రాక్టర్ జీతాలు చెల్లించడం లేదని పీఎఫ్, ఈఎస్ఐ కట్టడం లేదని దీనికి నిరసనగా ఈ నెల 24 నుంచి కార్మికులు నిరవధిక సమ్మె చేయడానికి నిర్ణయించినట్టు జిల్లా మెడికల్ కాంట్రాక్టు అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె.కృష్ణమాచార్యులు, జిల్లా కార్యదర్శి వి.దత్తాత్రేయ(దత్తు) వెల్లడించారు. ఫస్ట్ ఆబ్జెక్టు సంస్థ జిల్లాలోని అన్ని ఆసుపత్రులలో పారిశుధ్య పనులకు కాంట్రాక్టు పొందిందన్నారు. ఏడాదిన్నర నుంచి పీఎఫ్, ఈఎస్ఐ కట్టడం లేదని వచ్చే నెలతో ఆ సంస్థ కాంట్రాక్టు గడువు ముగుస్తుందని మరోవైపు కొత్త కాంట్రాక్టు కోసం ఇప్పటికే టెండర్ నోటిఫికేషన్ జారీ చేశారన్నారు. ఈ నేపథ్యంలో కార్మికులకు జీతాలు, పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించాలన్నారు. అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా చర్యలు తీసుకోకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఈనెల 24వ తేదీ నుంచి అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో పారిశుధ్య కార్మికులు నిరవధిక సమ్మెకు దిగుతున్నట్టు వెల్లడించారు. ఈ మేరకు సమ్మె నోటీసు లను అధికారులకు అందరికీ పంపించినట్టు తెలిపారు.

కొండంగి ఎత్తిపోతల పథకం పునః ప్రారంభం



కలిదిండి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : కొండంగి ఎత్తిపోతల పథకాన్ని ఎత్తిపోతల కమిటీ చైర్మన్ వేగిరెడ్డి చిన్నారావు సోమవారం పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లంక గ్రామాలకు ఎత్తి పోతల పథకాలు వరమన్నారు. వైసీపీ హయాంలో ఎత్తిపోతల పథకాలను నిర్వీర్యం చేసిందన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు జోగిరాజు, కలిదిండి, కోరుకల్లు డీసీ చైర్మన్లు ముద్దం భోగేశ్వరరావు, పి.సత్యనారాయణ, వైస్ చైర్మన్ నున్న కృష్ణబాబు, నీటి సంఘాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



చల్లగా ఉండు నాయనా ..!

లోకేశ్.. జోష్ !

రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ సోమవారం ఉండి, కాళ్ల మండలం పెద అమిరంలో పర్యటించారు. పెద అమిరంలో రతన్ టాటా కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఉండి జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించి పాఠశాల తరగతి భవనాలను ప్రారంభించారు. చిన్నారులతో ముచ్చటించారు. ఎస్ఆర్కేఆర్ కళాశాలలో విద్యార్థులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు.. విద్యార్థులతో సెల్ఫీలు దిగారు



బావున్నారా : ఆత్మీయంగా పలకరిస్తూ..





ఉండి పాఠశాల విద్యార్థినులతో..



సెల్ఫీ విత్ ఎస్ఆర్కేఆర్ విద్యార్థినులు







బాగా చదువుకోవాలి : చిన్నారులతో సరదాగా..!



మళ్లీ మాస్కుల కాలం

సీజనల్ రుగ్మతలతో హెచ్ఎంపీవీ భయాందోళనలు

జిల్లాలో వైరస్ జాడలు లేవని వైద్య ఆరోగ్య శాఖ స్పష్టీకరణ

కొవిడ్ రోజులు గుర్తు చేసుకుంటున్న ప్రజలు

ఏలూరు అర్బన్, జనవరి 6(ఆంధ్రజ్యోతి):కొద్ది రోజులుగా చైనాను వణికిస్తోన్న హెచ్ఎంపీవీ(హ్యూమన్ మెటానిమో వైరస్) భారత్ లోనూ కర్నాటక తదితర రాష్ట్రాల్లో ప్రవేశించిందన్న వార్తలతో స్థానికంగా అప్రమత్తత చర్యలపై వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు పలు సూచనలు చేశాయి. నేడు వైద్య ఆరోగ్య శాఖ వైరస్‌కు సంబంధించి చేపట్టాల్సిన విధి విధానాలపై జిల్లాలకు ఆదేశాల్వినున్నది. ఆంధ్ర ప్రదేశ్‌లో ఇంత వరకు హెచ్ఎంపీవీ జాడలు లేవని ప్రభుత్వం ప్రకటించగా, గతంలో కొవిడ్ విజృంభణతో జరిగిన ప్రాణనష్టాన్ని ప్రజలు గుర్తు చేసుకుంటూ ఇపుడు మళ్లీ అదే చైనా దేశం నుంచి వైరస్ వ్యాప్తిపై ఒకింత ఆందోళన చెందుతున్నారు. 2020 ఫిబ్రవరి-మార్చి నెలల్లో చైనానుంచి ప్రవేశించి దేశాన్ని కుదిపేసిన కొవిడ్ వైరస్ రెండేళ్ల పాటు క్షేత్రస్థాయిలో ఫస్ట్‌వేవ్, సెకండ్ వేవ్‌ల రూపంలో దాదాపు అన్ని వయసులవారిని కబళించిన విషయం విధితమే. కొన్ని వారాలపాటు లాక్‌డౌన్‌తో వైద్య, పారిశుధ్య, పోలీస్ సేవలు మినహా మిగతా అన్ని వ్యవ స్థలు స్థంభించడం, కొవిడ్ బాధితులతో ప్రభుత్వ ప్రైవేటు ఆస్పత్రులన్నీ కిక్కిరిసిపోవడం, ప్రాణనష్టం, కుటుంబాల్లో ఆర్థికవ్యవస్థ చిన్నాభిన్నం కావడం 21వ శతాబ్దపు అతిపెద్ద సామాజిక విధ్వంసంగా, వైపరీత్యంగా అందరికీ చేదు జ్ఞాపకాలనే మిగిల్చింది. మళ్లీ ఇన్నేళ్ళ తర్వాత హెచ్ ఎంపీవీ రూపంలో భయభ్రాంతులకు గురిచేస్తోన్న ఈ చైనా వైరస్‌కు, కొవిడ్ వైరస్‌కు ఇంచుమించుగా ఒకే రకమైన లక్షణాలను వైద్యవర్గాలు చెబుతుండటం గమ నార్హం. ఆ ప్రకారం ముక్కు కారడం, జ్వరం, దగ్గు, గొంతు నొప్పి తదితర లక్షణాలు హెచ్ఎంపీవీకి చెందినవేనని వివ రించాయి. అయితే సంబంధిత లక్షణాలు, రుగ్మతలతో బాధ పడుతున్నవారంతా చైనా వైరస్ బాధితులేనని నిర్ధార ణకు రావడం లేదా అనుమానించడం తొందరపాటేనని స్పష్టం చేశాయి. కొవిడ్ వైరస్ కూడా శీతాకాలంలోనే దేశంలో ప్రవేశించడం, చలికాలపు సీజనల్ రుగ్మతలైన దగ్గు, జలుబు, గొంతునొప్పి వ్యాప్తిచెందుతున్న క్రమంలో చైనా వైరస్ లక్షణాలు సహజంగానే చర్చనీయాంశ మ య్యాయి. హెచ్ఎంపీ వైరస్ తీవ్రత ఎక్కువగావున్న వారిలో బ్రాంకైటిస్, న్యూమోనియాకు దారితీయవచ్చునని హెచ్చరిస్తున్నారు.

నియంత్రణ చర్యలపై మార్గదర్శకాలు

డాక్టర్ మాలిని, డీఎంహెచ్‌వో

రాష్ట్రంలో చైనా వైరస్ ప్రవేశించిందనడానికి ఇంత వరకు ఎటు వంటి దాఖలాలు లేవు. ప్రభుత్వం నియంత్రణ చర్యలపై మార్గదర్శ కాలు ఇచ్చే అవకాశం ఉంది. ప్రజలు ఎటువంటి ఆందోళన చెంద నక్కర్లేదు. కోవిడ్‌నే సమర్ధవంతంగా ఎదుర్కొన్న వైద్య యంత్రాంగం రాష్ట్రంలో ఉంది. ప్రభుత్వ ఆదేశాలు అందిన వెంటనే క్షేత్రస్థాయిలో అప్రమత్తత చర్యలపై ప్రజలను చైతన్యవంతం చేస్తాం. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలి. ముఖ్యంగా మాస్క్‌ను ధరించాలి. రద్దీప్రాంతాల్లో జాగ్రత్తలు తీసుకోవాలి. ఇపుడు వెలుగులోకి వస్తోన్న సాధారణ జలుబు, ఇతర ఇన్‌ఫెక్షన్లు శీతాకాలంలో సహజంగా వచ్చేవే. ఈ రుగ్మతలకు, హెచ్ఎంపీవీకి ఎటువంటి సంబంధం లేదు.

కొవిడ్ జాగ్రత్తలే.. తీసుకోవడం మేలు

డాక్టర్ నరేంద్రకృష్ణ, ప్రాజెక్టు మేనేజర్, అంటువ్యాధుల విభాగం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ

హెచ్ఎంపీవీపై కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల నుంచి సోమవారంవరకు ఎటువంటి సమాచారం లేదు. కోవిడ్ తీవ్రతను ఇపుడు చైనావైరస్ వ్యాప్తికి సరిపోల్చి చూడటం సరికాదు. కానీ ఆరోగ్యకరమైన ముందస్తు జాగ్రత్తలు పాటించడం ఎప్పుడూ మంచిదే. తుమ్ములు, దగ్గువల్ల వెలువడే తుంపర్లనుంచి, ఏదైనా వైరస్‌లు బారిన పడినవారికి సన్నిహితంగా మెలగడం, బాధితులను తాకడం, ఆ చేతులతో ముక్కు, నోరు, కళ్ళను తాకడం చేయొద్దు. కోవిడ్ ముందస్తుజాగ్రత్తల మాదిరిగానే చేతులను తరచూ సబ్బుతో కనీసం 20 సెకన్లు కడుక్కోవాలి. చేతులను శుభ్రంచేసుకోకుండా నోరు, ముక్కు, కళ్ళను తాకొద్దు. బహిరంగప్రదేశాల్లో మాస్క్‌ను ధరించాలి. ఏదైనా వైరస్‌బారిన పడితే బయట తిరగొద్దు.



స్టాక్ మార్కెట్‌కు వైరస్ ఫియర్

నరసాపురం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల క్రితం స్టాక్ మార్కెట్‌లో వచ్చిన ఫియర్ మళ్లీ సోమవారం కనిపించింది. చైనాను వణిస్తున్న హెచ్ఎంపీవీ వైరస్ ఇండియాలో నమోదు కావడంతో మదుపుదారుల్లో భయం ఏర్పడింది. దీంతో అయినకాడికి అమ్మకాలకు దిగడంతో ఇండెక్స్ కుప్పకూలింది. అన్ని రంగాల షేర్లు భారీ పతనాన్ని నమోదు చేసుకు న్నాయి. జిల్లాలో రూ.50 కోట్లపైనే సంపద ఆవిరైంది. ఈ ఫియర్‌తో నష్టాల్లో ఉన్న షేర్లను అయినకాడికి అమ్ము కున్నారు. కొవిడ్ సమయంలో మార్కెట్‌లో నెలకొన్న పరిణామాలు మళ్లీ పునరావృతం అవుతాయన్న భయంతో భారీ నష్టాలను మూటగట్టుకున్నారు. జిల్లాలో భీమవరం, తణుకు, టీపీగూడెం, పాలకొల్లు, నరసాపురం, పెనుగొండ తదితర ప్రాంతాల్లో స్టాక్ మార్కెట్‌కు అనుసంధానంగా ఉండే కార్పొరేట్ సంస్థల ట్రేడింగ్ సెంటర్లు ఉన్నాయి. నిత్యం ఈ సెంటర్లల్లో కోట్లల్లో కొను గోలు, అమ్మకాలు జరుగుతుంటాయి. ఇటీవల మార్కెట్ మంచి లాభాలు ఇస్తుండటంతో, పలు కంపెనీలు ఐపీవోలకు రావడం, బ్యాంకు వడ్డీల కన్నా.. మార్కెట్‌లో పెట్టుబడులు పెడితే మంచి లాభాలు వస్తాయన్న నమ్మకంతో చాలా మంది స్టాక్ మార్కెట్‌వైపు మళ్లారు. దానికి అనుగుణంగా కొందరు లాభాలను కూడా గడించారు. రానున్న బడ్జెట్ మార్కెట్‌కు మరింత ఊతం ఇస్తుందన్న నమ్మకంతో ఇటీవల భారీ పెట్టు బడులు పెట్టి ఎదురు చూస్తు న్నారు. ఈ తరుణంలో వైరస్ ఫియర్ మదుపుదారుల ఆశలపై నీళ్లు చల్లింది. రానున్న రోజుల్లో ఈ ప్రభావం ఇంకెంత నష్టాన్ని చూపుతుందో నన్న భయం వీరిలో నెలకొంది. జిల్లాలో అన్ని ట్రేడింగ్ సెంటర్లు నష్టాలే చవి చూశాయి. మార్కెట్ పడిపోతున్నా... కొనుగోలు చేసేందుకు ఎవరూ సాహసించలేదు.

ఆ.. గ్రామం వీరుల గడ్డ.. దేశానికి రక్షణగా నిలవాలని ఒట్టు పెట్టుకున్న గ్రామం.. మగ బిడ్డ పుడితే దేశ రక్షణలో భాగంగా సైనికుడిగా వెళ్లాలని ఆడ బిడ్డ పుడితే సైనికుడికి భార్యగా పంపాలని ముందే ఆ గ్రామంలో ఓ నిర్ణయానికి వచ్చేస్తారు. ఐదు వేల జనాభా ఉండే ఆ గ్రామం నుంచి ఇప్పటివరకు 2 వేలకు పైగా సైనికులుగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన వారు ఉన్నారు. బోర్డర్‌లో 180 మందికి పైగా ప్రస్తుతం సేవలందిస్తున్నారు. ఆ ఊరి పేరు మాధవరం.. గ్రామస్తులు మిలట్రీలో సేవలందిస్తుండడంతో మిలటరీ మాధవరంగా పేరు మార్చారు.. ఇదీ ఈ వూరి కథ..

- తాడేపల్లిగూడెం రూరల్/ఆంధ్రజ్యోతి



దేశ రక్షణలో..

మిలటరీ మాధవరం

బ్రిటిష్ వారి కాలం నుంచి ఆర్మీలో ఈ గ్రామం నుంచి యువకులు సేవలందిస్తున్నారు. 1814 నుంచి ఇప్పటి వరకూ దేశరక్షణలో సేవలందిస్తున్నారు. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లతో పాటు బీఎస్ఎఫ్ విభాగాల్లో సైనికులుగా పనిచేస్తు రక్షణ విభాగంలో ముందు వరుసలో ఉండేవారు. ఆడవారు పుడితే సైనికులకే ఇచ్చి వివాహం చేసేందుకు ప్రాధాన్యం ఇస్తారు. మాధవరం నుంచి ఆర్మీ, నేవీల్లో ఎక్కువగా విధులు నిర్వహిస్తున్న గ్రామస్థులకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ గ్రామంలో ఆర్మీలో బేస్ ఉద్యోగమైన సైనికుని దగ్గర నుంచి కల్నల్ వరకూ అనేక విభాగాల్లో గ్రామస్థులు సేవలందిస్తున్నారు.

ప్రతీ ఇంటి నుంచి ఓ సైనికుడు

మొదటి ప్రపంచయుద్ధ కాలంలోనూ సేవలు

గ్రామానికి చెందిన కొప్పల సత్యనా రాయణ, డొంకా ప్రవీణ్ కుమార్‌లు కల్నల్‌గా పనిచేస్తున్నారు.

బీడీఎల్ నుంచి రూ.11 కోట్లు నిధులు

తాడేపల్లిగూడెం నుంచి ప్రాతినిధ్యం మంత్రిగా ప్రాతినిధ్యం వహించిన పైడికొండల మాణిక్యాలరావు చొరవతో దేశ రక్షణలో ఉన్న వారి గ్రామాలకు ప్రత్యే నిధి ఇచ్చే భారత్ డైనమిక్స్ లిమిటెడ్ సంస్థ వారు రూ.11 కోట్ల రూపాయలు ఈ గ్రామంలో సైనికులకు, సైనికుల కుటుంబాలకు ఉపయోగ పడే విధంగా నిర్మాణాలు చేపట్టేందుకు ముందుకువచ్చారు. గ్రామస్థులకు అవసరమైన జిమ్, కళాశాలలో ల్యాబ్‌లు, పాఠశాలలో అదనపు భవనాలు ఇలా రూ.5 కోట్లతో నిర్మాణాలు పూర్తిచేశారు.

సైనికులపై సినిమాలు..

దేశ రక్షణలో ఆ గ్రామం ఎంతగా ఫేమస్ అయిం దంటే ఈ గ్రామం గురించి ఓ సినిమా కూడా తీసేందుకు ముందుకు వస్తున్నారు. నాపేరు సూర్య సినిమా ప్రమోషన్స్‌లో అల్లు అర్జున్, ఆపరేషన్ వాలంటైన్ సినిమా ప్రమోషన్స్‌లో వరుణ్‌తేజ్‌లు ఈ గ్రామాన్ని సందర్శించారు. గ్రామం నుంచి సేవలం దించిన సైనికులను గుర్తించడంతో పాటు యుద్ధంలో వీరమరణం పొందిన వారి కుటుంబాల వారిని సత్కరించారు. సైనికుల కథ ఇతివృత్తంగా ఓ దర్శకుడు నిర్మిస్తున్న మిస్టర్ సోల్జర్ సినిమా పోస్టర్‌ను ఇటీవల మాజీ సైనికులు ఆవిష్కరించారు.



అమరవీరుల స్తూపం

గ్రామం నుంచి దేశ రక్షణలో పనిచేసి అమరులైన వారి స్మారకార్థం ఉరి నడిబొడ్డున ఓ స్తూపం ఏర్పాటు చేశారు. ఈ స్తూపం వద్దే దేశానికి సంబంధించిన ఏ కార్యక్రమమైనా నిర్వహిస్తూ దేశ భక్తిని చాటుతుంటారు. ముఖ్యంగా పంద్రాగస్టు వేడుకలు, ఘనతంత్ర వేడుకలు, కార్గిల్ దివస్ తదితర కార్యక్రమాలు వీరికి పండుగలే. అలాగే దేశ రక్షణలో సేవలందించిన, సేవలందిస్తున్న వారి కుటుంబాల కోసం ఓ సంఘాన్ని ఏర్పాటు చేసు కున్నారు. మాజీ సైనికోద్యోగుల సంఘం ఏర్పాటు చేసుకున్నారు. దీని ద్వారా గ్రామంలో ఇబ్బందులు పడుతున్న వారి కుటుంబాలకు సాయమందిసు ్నారు. గ్రామాన్ని సందర్శించడానికి వస్తే గ్రామ విశేషాలతో పాటు దేశ రక్షణలో తమ సభ్యులు చేసిన త్యాగాల గురించి చెబుతుంటారు..



- సైనికుల గ్రామంలో పుట్టడం మా అదృష్టం. నేను కూడా ఆఫీసర్ కేడర్‌లో ఉద్యోగ విరమణ చేశాను. గ్రామంలో సైనికుల కుటుంబాలకు అండగా ఉండేందుకు, సంక్షేమం చూసేందుకు మా వంతు పనిచేస్తాం.

- బొల్లం వీరయ్య, మాజీ సైనికోద్యోగుల సంఘ అధ్యక్షుడు



- మా గ్రామంలో 2 వేలకు పైగా దేశ రక్షణలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన వారు ఉన్నారు. వారి కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అందాల్సిన సదుపాయాలు, వసతులు అందించేందుకు మా సంఘం పనిచేస్తుంది. నేటి తరం కోసం మా సలహాలు అందిస్తుంటాం.

- గోపిశెట్టి భరతుడు, మాజీ సైనికోద్యోగి, మాధవరం



- మా ఆయన నరసింహులు సైన్యంలో పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. వచ్చిన వెంటనే మాకు ప్రజలు గ్రామ సేవ అందించే అవకాశం ఇచ్చారు. ఆయనకు గ్రామం అంటే ఎంతో ఇష్టం.. గ్రామ అభివృద్ధే ధ్యేయంగా మా శాయశక్తులా పనిచేశాం.

- కౌలూరి పరిమళ, మాజీ సర్పంచ్, మాధవరం



ఉత్తర ద్వారాన్ని శుభ్రం చేస్తున్న సిబ్బంది

ముక్కోటికి ముస్తాబు

ద్వారకాతిరుమలలో 10న ఉత్తరద్వార దర్శనం

ద్వారకాతిరుమల, జనవరి 6(ఆంధ్రజ్యోతి):ద్వారకా తిరుమల చిన వెంకన్న ఆలయం ముక్కోటి వేడుకలకు ముస్తాబవుతోంది. ఆలయగోపురాలు విద్యుత్‌దీపతోరణాలతో, రంగులతో అలంకరిస్తున్నారు. ప్రత్యేక క్యూలైన్ల ఏర్పాటు చేస్తున్నారు. ఉత్తరద్వారాలను శోభయమానంగా తీర్చిదిద్దుతు న్నారు. ఈ నెల 10న ముక్కోటి పురస్కరించుకుని తెల్లవారుజామున 4 గంటల నుంచి 5 వరకూ ప్రొటోకాల్ దర్శనాలు, తరువాత నుంచి సర్వదర్శనం రాత్రి 9 గంటల వరకూ ఉంటుంది. దాదాపు 50 వేలమంది వరకూ భక్తులు ఉత్తరద్వార దర్శనానికి రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ముక్కోటికి ప్రత్యేక దర్శనంగా రూ.500 టిక్కెట్టును ప్రవేశపెట్టారు. ఈ టిక్కెట్లు ఇప్పటికే ఆన్‌లైన్‌లో ఉంచామని అధికారులు చెబుతున్నారు. దీంతో పాటు రూ.100, రూ.200 టిక్కెట్లు ఉంటాయి.

9న సప్తగిరి వాసునికి గిరి ప్రదక్షిణ

ఈనెల 9 మధ్యాహ్నం 2-30 గంటల నుంచి గిరిప్రదక్షిణ ఆలయ తొలిమెట్టు ప్రాంతం నుంచి ప్రారంభం కానుంది. గోవింద స్వాములు, భజన, కోలాటబృందాలు, అశ్వ, గజ సేవల నడుమ సుమారు 5 కి.మీ మేర అట్టహాసంగా జరిపే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ముక్కోటి ముందురోజు సాయంత్రం 6-30 నుంచి శ్రీవారి నిజరూప దర్శనం లభించనుంది. నిత్యం సకల ఆభరణాలు,పుష్పమాలికలు, తులసిమాలలతో కొలువుతీరే శ్రీవారు ఆరోజు ఏవిధమైన అలంకారాలు లేకుండా సాక్షాత్కరించనున్నారు. మరుసటిరోజు వరకూ భక్తులకు ఈ దర్శనం ప్రత్యేకం.



క్యూలైన్ల ఏర్పాటు

ఏయూ దూరవిద్య డిగ్రీ పరీక్షల షెడ్యూల్ ఖరారు

ఏలూరు అర్బన్, జనవరి 6 (ఆంధ్ర జ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం దూర విద్య, ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ ద్వారా బీఏ, బీకాం, బీఎస్సీ క్యాలెండర్ బ్యాచ్, 2018 తర్వాత జాయన్‌అయ్యి సబ్జెక్టులు పాస్ కాని విద్యార్థులకు పరీక్షల నోటిఫికేషన్ జారీ అయ్యిందని యూనివర్సిటీ స్టడీ సెంటర్ కో-ఆర్డినేటర్ రామరాజు, అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ విజయ్‌కుమార్ తెలిపారు. డిగ్రీ తృతీయ సంవత్సరం పరీక్షలు ఫిబ్రవరి 12 నుంచి ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయి. డిగ్రీ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ఫిబ్రవరి 12 నుంచి మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5 గంటల వరకు, ప్రథమ సంవత్సరం పరీక్షలు ఫిబ్రవరి 28 నుంచి ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, సెకండ్ సెమిస్టర్ పరీక్షలు ఫిబ్రవరి 28న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగుతాయని వివరించారు. పరీక్షఫీజును ఈ నెల 2వ తేదీలోగా చెల్లించాలని, పెనాల్టీ రూ.500తో కలిపి ఈ నెల 30వ తేదీ వరకు చెల్లించవచ్చునని తెలిపారు. ప్రస్తు త విద్యా సంవత్సరం నుంచి ఏయూ డిగ్రీ దూర విద్య (సీడీఓఈ) పరీక్షలు ఏలూరు సీఆర్ రెడ్డి కళాశాలలోనే నిర్వహించడానికి యూనివర్సిటీ నిర్ణయించిందని వివరించారు.

వెబ్‌సైట్లలో ఫార్మాసిస్టు నియామకాల తుది మెరిట్ జాబితా

ఏలూరు అర్బన్, జనవరి 6 (ఆంధ్ర జ్యోతి) : వైద్యఆరోగ్యశాఖ జోన్-2 పరిధిలోని జిల్లాల్లో (ఉమ్మడి ఉభయగోదావరి, కృష్ణా) గ్రేడ్-2 ఫార్మాసిస్టు నియామకాలను కాంట్రాక్టు పద్ధతిన భర్తీచేసేందుకు గతేడాది ఫిబ్రవరి 20 వరకు స్వీకరించిన దరఖాస్తుల పరిశీలన అనంతరం సవరించిన ప్రొవిజనల్ మెరిట్ లిస్టులను సంబంధిత జిల్లాల వెబ్‌సైట్లలో ఈ నెల 4న పొందుపర్చినట్టు ప్రాంతీయ వైద్య ఆరోగ్య (రాజమహేంద్రవరం) డైరెక్టర్ డాక్టర్ పద్మాశశిధర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే విడుదల చేసిన ప్రొవిజనల్ జాబితాపై అభ్యర్థుల నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిష్కరించి సవరణలతో కూడిన తుది మెరిట్ జాబితాను వెబ్‌సైట్లలో పొందుపర్చినట్టు వివరించారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా మెరిట్, రిజర్వేషన్ నియమాల ప్రాతిపదికన జరుగుతుందని తెలిపారు. ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించే దళారులను ఆశ్రయించి మోసపోవద్దని అభ్యర్థులకు సూచించారు.

ఆగని ఇసుక దందా



» ర్యాంపులలో నిలువు దోపిడీ » ఐదు యూనిట్లకు అక్రమంగా రూ.5వేలు వసూలు » ఉచిత పథకానికి తూట్లు » ప్రభుత్వానికి అప్రదిష్ట

పాలకొల్లు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల్లోని పలు ఇసుక ర్యాంపులలో ఇసుక ఎగుమతులలో నిలువునా దోచేస్తున్నారు. నిర్ణిత ధర కంటే లారీకి రూ.5వేలు అదనంగా వసూలు చేస్తున్నారు. పాత పశ్చిమగోదావరి జిల్లాలో ఒక మాజీ ప్రజాప్రతినిధి పాత ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలువురు ప్రజాప్రతినిధులు హస్తం ఉందని బహిరంగంగానే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉచిత ఇసుక పాలసీ పారదర్శకంగా అమలు చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కఠినమైన చర్యలు అమలు చేస్తామని చెబుతున్నప్పటికీ కూటమికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు అక్రమ సంపాదనకు పాల్పడటం విమర్శలకు దారి తీస్తుంది. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ఊబలంక ఇసుక ర్యాంపులో ఐదు యూనిట్లు ఇసుక ఎగుమతికి నిర్ణీత ధర రూ.28 వందలు కాగా రూ.7వేలు వసూలు చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఊబలంక ర్యాంపులో రాత్రి సమయంలోనే ఎగుమతులు జరుగుతున్నాయి. ఆత్రేయపురం ర్యాంపులో నిర్ణీత ధర రూ.2వేలు అయితే రూ.7వేలు, అంకంపాలెం ర్యాంపులో రూ.26వందలు అయితే రూ.7వేలు, వద్దిపర్రు ర్యాంపులో రూ.26వందలు అయితే రూ.7వేలు వసూలు చేస్తున్నారు. సీఆర్‌జడ్ పరిధిలో ఉన్న గోపాలపురం, జొన్నాడ ర్యాంపులలో అనుమతులు లేనప్పటికీ జొన్నాడలో రూ..8వేలు, గోపాలపురం రూ.7500 వసూలు చేస్తూ అక్రమంగా దోచేస్తున్నారు. పాత పశ్చిమగోదావరి జిల్లాలోని పెండ్యాల ర్యాంపులో నిర్ణీత ధర రూ.1380 కాగా రూ.7500, పందలపర్రు ర్యాంపులో 2వేలు కాగా రూ.7500, తీపర్రు ర్యాంపులో 1920 కాగా రూ.7వేలు వసూలు చేస్తున్నారు.

బిల్లులు లేకుండా ఎగుమతులు

వాస్తవానికి అన్ని ర్యాంపులలోనూ ఇసుక తవ్వకాల పరిమితి ముగిసిందని చెబుతున్నారు. అయితే బిల్లులు లేకుండా ఎగుమతులు చేస్తున్న కారణంగా వచ్చే మే నెల వరకూ ఈ దందా కొనసాగిస్తారని తెలుస్తుంది. అక్రమంగా ఇసుక ఎగుమతులలో సైతం స్థానిక లారీలకే ప్రాధాన్యత ఇస్తున్నారని పలువురు లారీ యజమానులు చెబుతున్నారు. దీంతో అధిక శాతం టిప్పర్ లారీలు కిరాయిలు లేక ఖాళీగా ఉంటున్నామని లారీ యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అక్రమ తవ్వకాలు

ఉభయ గోదావరి జిల్లాల్లోని పడవ ర్యాంపులలో ప్రస్తుతం ఎగుమతులు నిలిచాయి. ఇసుక తవ్వకాలకు పర్యావరణ అనుమతులు రావాల్సి ఉండటంతో పలు ర్యాంపులలో ఎగుమతులు నిలిపి వేశారు. అయినప్పటికీ లారీలు నేరుగా వెళ్లే ర్యాంపులలో ఇసుకను అక్రమంగా తవ్వేస్తానే ఉన్నారు. ఇసుక అక్రమార్కులు సీఆర్‌జడ్ పరిధిలో ర్యాంపులనూ వదలటం లేదు.

నాయకుల కనుసన్నల్లోనే దందా

ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా బావిస్తున్న ఉచిత ఇసుక పాలసీ అభాసుపాలవుతున్నది. కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుంది. జగన్ తుగ్లక్ పాలన మించి కొందరు ప్రజాప్రతినిధులు అక్రమార్జనకు పాల్పడటం పట్ల కూటమి శ్రేణులే విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. ర్యాంపులలో నిర్ణీత ధరకే ఇసుక ఎగుమతి చేస్తే జిల్లాలో ఆయా ప్రాంతాలను బట్టి లారీ కిరాయి కలుపుకుని 5యూనిట్లు రూ.6వేలు నుంచి రూ.8వేలు మధ్యలో సరఫరా చేసే అవకాశం ఉంది. అయితే ఇప్పుడు ర్యాంపులలో లారీకి అదనంగా రూ.5వేలు వసూలు చేస్తుండటంతో వినియోగదారులకు చేరేటప్పటికి 5యూనిట్లు ఇసుక జిల్లాలో ఆయా ప్రాంతాలను బట్టి రూ.11వేలు నుంచి రూ.14వేలు అవుతుంది. ఇసుక దిగుమతులుపై అక్రమ వసూళ్లపై చర్యలు తీసుకోవాలని వినియోగదారులతో పాటు కూటమిలోని పలువురు ప్రజాప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

దేహదారుఢ్య పరీక్షల్లో 253 మంది అర్హత

ఏలూరు క్రైం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ కానిస్టేబుళ్ళ రిక్రూట్‌మెంట్‌లో భాగంగా సోమవారం 600 మంది అభ్యర్థులు హాజరు కావాలని హాల్‌టిక్కెట్లు జారీ చేశారు. వీరిలో 396 మంది హాజరు కాగా వారికి 1600 మీటర్ల పరుగుపందెం, లాంగ్‌జంప్, పలు ఈవెంట్స్‌ను నిర్వహించారు. వీటి లో 253 మంది అర్హత సాధించారు. ఏలూరు జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ పర్యవేక్షణలో ఈ దేహదారుఢ్య పరీక్షలు అభ్యర్థులకు నిర్వహించారు. అభ్యర్థులకు ఇచ్చిన తేదీలో హాజరు కాలేక అప్పీలు చేసుకున్న అభ్యర్థులు ఈనెల 9వ తేదీన నిర్వహించే దేహదారుఢ్య పరీక్షలకు హాజరు కావాలని ఎస్పీ సూచించారు.





లాంగ్ జంప్ చేస్తున్న అభ్యర్థి... అస్వస్థతకు గురైన మరో అభ్యర్థికి ఆస్పత్రిలో చికిత్స

ఇద్దరు అభ్యర్థులకు అస్వస్థత

పోలీస్ కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్‌లో భాగంగా దేహదారుఢ్య పరీక్షలకు హాజరైన కొయ్యలగూడెం మండలం అచ్యుతాపురానికి చెందిన టి.మధు అస్వస్థతకు గురయ్యాడు. మధు 1600 మీటర్ల పరుగుపందాన్ని సోమవారం ఉదయం విజయం సాధించి అనంతరం అస్వస్థతకు గురికావడంతో వైద్య పరీక్షలు నిర్వహించారు. అతనితో పాటు మరో అభ్యర్థి కూడా అస్వస్థతకు గురి కావడంతో అక్కడ ఉన్న ప్రత్యేక వైద్యుల బృందం వైద్య పరీక్షలు నిర్వహించి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి అత్యవసర విభాగంలో ఉన్న దుర్గాకుమార్ వైద్య పరీక్షలు నిర్వహించారు. అభ్యర్థి మధు ఆహారం తీసుకోకపోవడం వల్ల నీరసించి అస్వస్థతకు గురయ్యాడని వైద్యులు నిర్ధారించారు. అతనికి సెలైన్లు ఎక్కించారు.

సంక్రాంతికి మరో నాలుగు రైళ్లు



ఏలూరు క్రైం, జనవరి 6 (ఆంధ్ర జ్యోతి): సంక్రాంతి పండుగను పురస్క రించుకుని ప్రయాణికుల రద్దీ దృష్ట్యా విజయవాడ దక్షిణమధ్య రైల్వే శాఖ అధికారులు మరో నాలుగు రైళ్లను ఏలూరు మీదుగా నడపడానికి సోమ వారం చర్యలు చేపట్టారు. రైల్ నెంబర్ 07615 కాచిగూడ, శ్రీకాకుళం రోడ్డు ఈనెల 11, 15 తేదీలలో నడుస్తుంది. రైల్ నెంబర్ 07616 శ్రీకాకుళం రోడ్డు- కాచిగూడ ఈనెల 12, 16 తేదీలలో నడుస్తుంది. రైల్ నెంబర్ 07617 చర్లపల్లి - శ్రీకాకుళం రోడ్డు ఈనెల 8వ తేదీన, 07618 శ్రీకాకుళం రోడ్డు- చర్లపల్లి రోడ్డు ఈనెల 9వ తేదీన నడుస్తుంది. ఈరైళ్ళు మల్కాజ్‌గిరి, చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లి గూడెం, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి, పొందూరు, స్టేషన్లలో ఆగనున్నాయి.

రైళ్ల సమయం మార్పు

రైల్‌నెంబర్ 17206 కాకినాడ పోర్టు - షిర్డిసాయినగర్ రైలు ఈనెల 1వ తేదీ నుంచి ప్రయాణ సమయం మార్పు జరిగిందని ప్రయాణికులు గమనించాలన్నారు. ఇప్పటికే రిజర్వేషన్లు చేయించుకున్న ప్రయాణికులు రైల్వే ఎంక్వైరీ ద్వారా సమాచారం పొందాలన్నారు. పాతసమాచారం ప్రకారం కాకినాడ పోర్టులో ఉదయం 6 గంటలకు బయలు దేరాల్సి ఉండగా కొత్త సమయం ప్రకారం ఉదయం 5.05 గంటలకు బయలుదేరుతుందన్నారు. ఏలూరులో ఉదయం 8.45 గంటలకు గతంలో వచ్చేదని ఇప్పుడు ఉదయం 7.30 గంటలకే వస్తుందని తెలిపారు. అన్ని స్టేషన్లలో ఇదే విధంగా సమయం మార్పు చేయడం జరిగిందన్నారు.

రేపు జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలు

ఏలూరుసిటీ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశాలు ఈనెల 8వ తేదీ బుధవారం మధ్యాహ్నం 2గంటల నుంచి ఏలూరులోని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి కెఎస్ఎస్ సుబ్బారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1 నుంచి 7 స్థాయి సంఘాల సమావేశాలకు ఆయా కమిటీల జడ్పీటీసీ సభ్యులు హాజరు కావాలని ఆయన కోరారు. 1, 2, 4, 7 స్థాయి సంఘ సమావేశాలకు జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షత వహిస్తారని ఆయన తెలిపారు. ఈ స్థాయి సంఘ సమావేశాల్లో స్థాయి సంఘాల వారీగా జిల్లా అధికారులతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష చేయటం జరుగుతుందని , జిల్లా ప్రజా పరిషత్ పరిపాలనకు సంబంధించిన అజెండా అంశాలను ఆమోదించటం జరుగుతుందని ఆయన వివరించారు.

విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనపై నేడు ప్రజాభిప్రాయ సేకరణ

భీమవరం టౌన్,నరసాపురం జనవరి 6 (ఆంధ్ర జ్యోతి) : విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనపై మంగళ వారం ఏపీఈఆర్‌సీ చేపట్టే ప్రజాభిప్రాయ సేక రణకు జిల్లా ఈపీడీసీఎల్ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. భీమవరంలోని ఎస్ఈ కార్యాలయం, నరసాపురం, తాడేపల్లిగూడెం ఈఈ కార్యాలయాల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడేందుకు వీలుగా డిజిటల్ స్ర్కీన్‌లు ఏర్పాటు చేశారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ అభిప్రాయ సేకరణ జరుగుతుంది. రెండు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో వినియోగదారులు తమ అభిప్రాయాలను నేరుగా హెచ్‌ఆర్‌సీ చైర్మన్ ఠాగూర్ రామ్ సింగ్‌కు తెలియజేయవచ్చని ఏపీ ఈపీడీసీఎల్ ఎస్ఈ రఘునాథబాబు తెలిపారు.



వివరాలు తెలియజేస్తున్న ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ రఘునాథబాబు





శృంగవృక్షంలో ఆగకుండా వెళ్ళిపోతున్న పాసింజర్ రైల్... గేటు వద్ద నిలిచిపోయిన వాహనదారులు

శృంగవృక్షం స్టేషన్‌లో ఆగకుండా వెళ్లిపోయిన పాసింజర్

వెనక్కు వచ్చి ప్రయాణికులను ఎక్కించుకున్న వైనం..

డ్రైవర్‌పై చర్యలు తీసుకుంటాం

భీమవరం రైల్వేస్టేషన్ మాస్టర్

పాలకోడేరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : నర్సాపురం నుంచి విజయవాడ వెళ్లే పాసింజర్ రైలు సోమవారం ఉదయం 10.30 గంటల సమయంలో శృంగవృక్షం రైల్వే స్టేషన్‌లో ఆగకుండా ముందుకు వెళ్ళిపోయింది. స్టేషన్‌లో ప్రయాణికులు కేకలు వేయడంతో ముందుకు వెళ్ళిన ట్రైన్ మళ్ళీ వెనుక్కు వచ్చి ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్ళింది. ప్రతిరోజులాగానే నరసాపురం నుంచి విజయవాడ వైపు ఉదయం 10.30 గంటల సమయంలో పాసింజర్ రైలు వెళుతూ ఉంటుంది. శృంగవృక్షం రైల్వే స్టేషన్‌లో పాసింజర్ రైలు ఆగి ప్రయాణికులను ఎక్కించుకున్న తర్వాత భీమవరం మీదుగా విజయవాడ వెళుతూ ఉంటుంది. సోమవారం ఉదయం పాసింజర్ రైలు డ్రైవర్‌కు ఏమైందో ఏమో తెలియదుగాని ఆదమరచి శృంగవృక్షం మీదుగా పెన్నాడ వైపు రైలు ఆగకుండా వెళ్ళిపోయింది. దీంతో స్టేషన్‌లో ఉన్న రైల్వే సిబ్బందితోపాటు రైలు ఎక్కడానికి వచ్చిన ప్రయాణికులు సైతం ఒక్కసారిగా అవాక్కయ్యారు. ఆగకుండా వెళ్ళిపోవడంతో కొంతమంది కంగారుపడి కేకలు వేయడంతో పాటు రైల్వే సిబ్బంది అప్రమత్తం అవ్వడంతో అదే ట్రైన్‌ను మళ్ళీ వెనక్కి రప్పించి ప్రయాణికులను ఎక్కించారు. ఈలోగా జాతీయ రహదారిపై శృంగవృక్షం వద్ద ఉన్న రైల్వే గేటు సుమారు పది నిమిషాల పాటు తెరచుకోకపోవడంతో రెండు వైపులా పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఇదే విషయమై రైల్వే అధికారులను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని, సంబంధిత డ్రైవర్‌పై నివేదిక తీసుకుని దాని ఆధారంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

'నన్నయ'లో ఫిబ్రవరి 5 నుంచి గిరిజన సాంస్కృతిక మహోత్సవం

రాజమహేంద్రవరం, జనవరి 6: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఫిబ్రవరి 5, 6 తేదీల్లో జాతీయ స్థాయి గిరిజన సాంస్కృతిక మహోత్సవం కార్యక్రమాలు జరుగుతాయని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. టీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి గిరిజన సాంస్కృతిక మహోత్సవం బ్రోచర్‌ను వీసీ సోమవారం విడుదల చేశారు.. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకునేందుకు జాతీయస్థాయిలో గిరిజన సాంస్కృతిక మహోత్సవాన్ని జయప్రదం చేయాలని పేర్కొన్నారు. ట్రైబుల్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు కరంసి అక్కులప్పనాయక్, రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప, ప్రధాన కార్యదర్శి ముడవత్ విష్ణునాయక్, నిర్వాహకులుగా వ్యవహరిస్తారని తెలిపారు. రిజిస్ట్రార్ జి.సుధాకర్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల, అసిస్టెంట్ ప్రొఫెసర్ వరహాలదొర పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : పురుగు మందు తాగి తీవ్ర అస్వస్థతకు గురై ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఒక వ్యక్తి మృతి చెందాడు. జంగారెడ్డిగూడెంలోని బైపాస్ దగ్గర రాజీవ్ నగర్‌కు చెందిన లింగాల శ్రీను (43)కు భార్య వెంకటలక్ష్మి, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. తాపీపనులు చేస్తూ జీవిస్తున్నారు. కారణం తెలియదు కాని ఈనెల 5వ తేదీన ఇంటి వద్ద పురుగు మందు తాగాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. జంగారెడ్డిగూడెం పోలీసులు ఏలూరు ప్రభు త్వాసుపత్రికి వచ్చి శవపంచనామా నిర్వహించి, పోస్టుమార్టం జరిపి బంధువులకు మృతదేహం అప్పగించారు. అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ ఢీకొని ఒకరి మృతి

మొగల్తూరు, జనవరి 6.(ఆంధ్రజ్యోతి): నడిచివెళ్ళే వ్యక్తిని బైక్ ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందినట్టు మొగల్తూరు ఏఎస్ఐ బండి సత్యనారాయణ తెలిపారు. పేరుపాలెం సౌత్ గ్రామానికి చెందిన బెల్లంకొండ సత్యనారాయణ (51) ఆదివారం రాత్రి రోడ్డుపై నడుచుకుంటూ వెళుతుండగా ఎదురుగా మోటార్ సైకిల్ ఢీకొనడంతో సత్యనారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని కుమారుడు సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



గుడాల ఆదిలక్ష్మి (ఫైల్)

మొగల్తూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) ముత్యాలపల్లి జాతీయ రహదారిపై రోడ్డు దాటుతుండగా ఒక మహిళ మృతి చెందినట్టు ఏఎస్ఐ బండి సత్యనారాయణ తెలిపారు. ముత్యాలపల్లికి చెందిన గుడాల ఆదిలక్ష్మి జాతీయ రహదారి నుంచి గెదళ్ళవంపు వెళ్ళే రోడ్డుకు వెళ్ళేందుకు రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొంది. తీవ్రగాయాలైన ఆదిలక్ష్మిని నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందిందన్నారు. కుమారుడు మహలక్ష్మిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ తెలిపారు.

వివాహం అవడం లేదని మనస్థాపంతో ఒకరి ఆత్మహత్య

భీమవరం క్రైం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : చేతిలో పని లేకుండాపోయిందని, వివాహం కావడం లేదని మనస్థాపానికి గురైన ఒక వ్యక్తి పురుగు మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు. దీనికి సంబంధించి వన్‌టౌన్ హెడ్ కా

క్రైమ్ కార్నర్

నిస్టేబుల్ చక్రవర్తి తెలిపిన వివరాల ప్రకారం నర్సయ్య అగ్రహారానికి చెందిన బైలపాటి పెద్దిరాజుకు నలుగురు కొడుకులు ఉన్నారు. రెండవ కొడుకైన బైలపాటి గొల్ల రామకృష్ణ (33) దివ్యాంగుడు కావడంతో డిగ్రీ చదివి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దస్తావేజుల లేఖరి వద్ద పనిచేస్తున్నాడు. అయితే ఇటీవల అది ఆన్‌లైన్ కావడంతో పని లేకుండాపోయింది. దాంతో పాటు వివాహం కూడా కాలేదు. మనస్థాపానికి గురైన రామకృష్ణ ఈనెల 5వ తేదీ సాయంత్రం భీమవరం లూథరన్ హైస్కూల్ గ్రౌండ్‌లో గడ్డి మందు తాగాడు. తర్వాత భయం వేసి తండ్రికి ఫోన్ చేసి చెప్పాడు. వెంటనే తండ్రి పెద్దిరాజు అక్కడకు చేరుకుని భీమవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ నుంచి విజయవాడ ఆసుపత్రికి తరలిస్తూ ఉండగా మార్గమధ్యలో మృతి చెందాడు. దీనిపై పెద్దిరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సి చక్రవర్తి తెలిపారు.

బైక్‌పై నుంచి పడి యువకుడి మృతి



మోరం హరీష్ (ఫైల్)

ఇరగవరం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనం అదుపుతప్పి యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి ఇరగవరం మండలం కె.ఇల్లిందలపర్రు గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కె.ఇల్లింద లపర్రు గ్రామానికి చెందిన మోరం హరీష్ (24) అదే గ్రామానికి చెందిన తన స్నేహితుడు ఆది ధర్మారావుతో కలిసి ఆదివారం రాత్రి 7 గంటలకు ద్విచక్ర వాహనంపై తూర్పువిప్పర్రు వైపు వెళుతుండగా సచివాలయం సమీపంలోకి వచ్చేసరికి వీరు ప్రయాణిస్తున్న వాహనం అదు పుతప్పి ఇద్దరూ కిందపడి పోయారు. ఈ ఘటనలో హరీష్ తలకు బలమైన గాయమై ముక్కు నుంచి రక్తం కారడంతో స్థానికులు తణుకు ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృత దేహానికి తణుకు జిల్లా ఆసుపత్రి నందు సోమవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేశారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇర గవరం ఎస్ఐ జానా సతీష్ తెలిపారు.

లారీ ఢీకొని ఒకరి మృతి

ఉండి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): లారీ రివర్సులో వెనక్కి వెళ్లి వ్యక్తిని ఢీకొట్టిన సంఘటనలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. ఉండి మండలం యండగండి గ్రామంలో ఆగివున్న లారీ వెనుక మూత్ర విసర్జన చేస్తున్న నెత్తింటి అప్పారావు (71)ను లారీ రివర్స్ చేయడంతో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతను మృతి చెందాడు. మృతుని కుమారుడు రాజా రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.



జనరల్ స్టోర్స్‌లో తనిఖీలు చేస్తున్న విజిలెన్సు అధికారులు

తాడేపల్లిగూడెంలో విజిలెన్స్ దాడులు

ఏలూరు క్రైం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా విజిలెన్స్ అండ్ రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారి పి.శ్రీరాంబాబుకు అందిన సమాచారంతో విజిలెన్సు అధికారులు సోమవారం తాడేపల్లిగూడెంలో పలు హోల్‌సేల్ పప్పుల షాపులు, జనరల్ స్టోర్స్‌పై దాడులు నిర్వహించారు. తాడేపల్లిగూడెంలోని మెస్సర్స్ శ్రీ వీరవెంకట సత్యనారాయణ జనరల్ స్టోర్, మెస్సర్స్ గ్రంధి మాణిక్యాలరావు ఎంటర్ ప్రైజెస్, మెస్సర్స్ శ్రీ లత ఎంటర్ ప్రైజెస్, మెస్సర్స్ శ్రీసూర్య ఎంటర్ ప్రైజస్, మెస్సర్స్ న్యూ విజయలక్ష్మి ట్రేడర్స్ షాపులలో తనిఖీలు నిర్వహించారు. జీడిపప్పు, పెసర పప్పు, పాస్తా, ఎండుకొబ్బరి, తురుమల ప్యాకెట్లపై తయారీదారు చిరునామా, గరిష్ట చిల్లదర, తయారీ తేదీ, బరువు, వినియోగదారు సహాయక కేంద్రం ఫోన్ నెంబర్ లేనట్లుగా గుర్తించారు. దీనిపై లీగల్ మెట్రాలజీ అధికారులు కేసు నమోదు చేశారు. తనిఖీలలో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్స్ శివరామకృష్ణ, ప్రసాద్‌కుమార్, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ పి రాంబాబు, వారి సిబ్బంది పాల్గొన్నారు.



యువతి పట్ల అసభ్య ప్రవర్తన.. బస్సుపై దాడి

ముదినేపల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో ఒక యువతి పట్ల అస భ్యంగా ప్రవర్తించడమే కాక ఆ బస్సును అడ్డగించి రాళ్లతో బస్సు అద్దాలను పగుల కొట్టిన ఘటన ముదినేపల్లి మండలం కొత్త పల్లి సెంటర్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం బంటుమిల్లి నుంచి గుడివాడ వెళుతున్న ఆర్టీసీ బస్సులో ఆదివారం రాత్రి కొత్తపల్లికి చెందిన ఒక యువతి ఎక్కింది. ఆమె వెనుకే ఎం.ఏసుబాబు అనే యువకుడు బస్సు ఎక్కి ఆ యువతి పక్కనే కూర్చుని అసభ్యంగా ప్రవర్తిస్తూ ప్రేమిస్తున్నా నంటూ ఫోన్ నెంబరు ఇవ్వాలంటూ ఒత్తిడి చేశాడు. అతని ప్రవర్తనపై ఆ యువతి బస్సు కండక్టర్‌కు చెప్పడమే కాక తన తల్లికి ఫోన్ చేసి చెప్పింది. బస్సు కొత్తపల్లి వచ్చేసరికి ఆమె తల్లి అక్కడికి చేరుకుని ఏసుబాబును నిలదీయడంతో అతడు బస్సు ను వెళ్లనీయకుండా దుంగను అడ్డంగా పెట్టి రాయితో బస్సు అద్దాన్ని పగులకొట్టాడు. ఈ ఘటనపై బస్సు డ్రైవర్ ఎం.వెంకారెడ్డి సోమవారం ఫిర్యాదు చేయ గా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ పద్మజ తెలిపారు.

మునిసిపల్ అధికారిపై అనుచిత ప్రవర్తన ఆరోపణలు ?

భీమవరం టౌన్, జనవరి 6: మునిసిపాల్టీలో పనిచేస్తున్న ఒక అధికారిపై మహిళాఉద్యోగులపై అనుచత ప్రవర్తన చేస్తున్నారని, ఉన్నాతాధికారులకు ఫిర్యాదు అందటం కొంత సంచలనం కలిగింది. రాష్ట్ర మునిసిపల్ మంత్రి నారాయణకు, మునిసిపల్ స్పెషలాఫీసర్‌కు ఫిర్యాదులు అందాయి. దీనిపై మునిసిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డిని ప్రశ్నించగా తమకు ఉన్నాతాధికారుల నుంచి ఫిర్యాదు అందిందని, దీని ఆధారంగా మునిసిపాల్టీ నుంచి ఇద్దరు మహిళా అధికారులతో కమిటీ వేసి మహిళా ఉద్యోగులను విచారణ చేయించామని ఏ మహిళా ఉద్యోగి ఎటువంటి ఫిర్యాదు చెయ్యలేదని తెలిపారు. అదేవిధంగా తమకు అందించిన ఫిర్యాదులో కూడా ఏ ఉద్యో గుల పేర్లతో సంతకాలు లేవని, కేవలం భీమవరం పురపాలక సంఘం మహిళా ఉద్యోగులు, వార్డు సచివాలయ మహిళా ఉద్యోగులు అని ఉందన్నారు.



ఏలూరు కేపీడీటీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి నిర్వహించిన ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళకు ప్రోత్సాహక బహుమతి అందజేసిన ఆర్ఎస్ షాపింగ్ మాల్ ప్రతినిధి సుబ్బారావు



కొఠారు ఇంటి దగ్గర నిరసన వ్యక్తం చేస్తున్న కొల్లేరు లంక గ్రామస్తులు

అబ్బయ్యచౌదరి ఇంటి వద్ద కొనసాగుతున్న నిరసన

పెదవేగి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి లండన్ నుంచి వచ్చి తమ సొమ్ము విషయమై సమాధానం చెప్పాలని కొల్లేరు లంక గ్రామస్తులు నినాదాలు చేశారు. చేపల చెరువులకు సంబంధించి కౌలు సొమ్ము ఇవ్వాలని కొండలరావుపాలెంలోని కొఠారు అబ్బయ్యచౌదరి ఇంటి వద్ద శ్రీపర్రు, కోమటిలంక గ్రామస్తులు చేపట్టిన నిరసన సోమవారం కొనసాగింది. వారు మాట్లాడుతూ 2019-24 మధ్య ఐదేళ్లలో చేపల చెరువులకు సంబంధించి అబ్బయ్యచౌదరి రూ.8కోట్లు ఇవ్వాల్సి ఉందన్నారు. ఐదేళ్లపాటు తిప్పించుకుని ఇప్పుడు లండన్ పారిపోయాడని వారు ఆరోపించారు. ఎక్కడకు వెళ్లినా ఇక్కడికి వచ్చి సమాధానం చెప్పేవరకు నిరసన కొనసాగుతుందన్నారు. నేతల రవి, సైదు సత్యనారాయణ, ఘంటసాల హరిబాబు, శ్రీహరి, పెద్దిరాజు, ముంగర వెంకటేశ్వరరావు, గంగాధరరావు, మునీంద్రరావు పాల్గొన్నారు.

పార్కుల్లో తిరుగుతున్న వారికి పోలీసు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ ఇస్తున్న మహిళా ఎస్ఐ కాంతిప్రియ

ఏలూరు క్రైం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పార్కుల్లో జంటలుగా తిరుగుతున్న విద్యార్థులను అభయ రక్షకదళం హెచ్చరించింది. నగరంలో సోమవారం సాయంత్రం అభయ రక్షకదళ్ గస్తీ నిర్వహిస్తున్న సమయంలో జన్మభూమి పార్కులో కళాశాల విద్యార్థులు జంటలుగా దర్శనమిచ్చారు. రక్షకదళ టీం ఇన్‌చార్జి ఎస్ఐ కాంతిప్రియ వారిని ఎవరు ఎక్కడ నుంచి వచ్చారని ప్రశ్నించగా వారి పేర్లను తప్పుగా చెప్పారు. వెంటనే ఎస్ఐ కాంతిప్రియ కళాశాల ఇన్‌చార్జిలను జన్మభూమి పార్క్ ప్రాంతానికి పిలిపించారు. వారిని కళాశాల సిబ్బంది గుర్తించారు. ఈ విషయాన్ని విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేస్తామని కాంతిప్రియకు తెలిపారు. తమ విద్యార్థులు బహిరంగ ప్రదేశాలలో తారసపడిన వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని కళాశాల సిబ్బంది ఎస్ఐ కాంతిప్రియను కోరారు. అనంతరం కాంతిప్రియ వారికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపివేశారు.

క్షేత్రస్థాయి పరిశీలన ఎంతో ఉపయోగం



ప్రదర్శన అంశాలను వివరిస్తున్న వ్యవసాయ విద్యార్థులు

పెదవేగి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ విద్యార్థులకు క్షేత్రస్థాయి పరిశీలన ఎంతో ప్రయోజనమని ఏలూరు ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ కె.ఫణికుమార్ అన్నారు. ప్రకాశం జిల్లా మార్కాపురం ఎంఎస్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు భోగాపురంలో సోమవారం రైతు సదస్సు, వ్యవసాయ వస్తు ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఫణికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు తరగతి గదిలో ఎంత నేర్చుకున్నా సంపూర్ణం కాదన్నారు. క్షేత్రస్థాయిలో రైతులతో మమేకమై తెలుసుకున్న విద్య ఉజ్వల భవిష్యత్‌కు తోడ్పడుతుందని ఆయన చెప్పారు. చదువుతోపాటు సాగు వివరాలు, అనుసరిస్తున్న విధానాలను తెలుసుకోవాలని ఆయన సూచించారు. పుస్తకాల్లో అంశాలకు, క్షేత్రస్థాయిలో జరిగే పనులకు బేధాలు ఉంటాయని, రెండింటిని అన్వయించుకుని మెరుగైన ఆలోచనలతో ముందుకెళ్తే భవిష్యత్‌లో మంచి శాస్త్రవేత్తగా గుర్తింపు పొందవచ్చన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తెలుసుకున్న వివిధ వ్యవసాయ అంశాలను ప్రదర్శించారు. మార్కాపురం ఎంఎస్ వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ఆర్‌వీఎస్కే.రెడ్డి, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ఎం.నాగేంద్రబాబు, ఏవోలు ఎం.ప్రియాంక, ప్రదీప్‌కుమార్, మహిళా రైతు పి.సరోజిని, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధిలో పేరెంట్స్ కమిటీ పాత్ర కీలకం

ఏలూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పాఠశాల అభివృద్ధిలో పేరెంట్స్ కమిటీ పాత్ర కీలకమని ఎంఈవో 2 జి.రాములు అన్నారు. జంగారెడ్డిగూడెం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణ కార్యక్రమానికి ఎంఈవో రాముడు పరిశీలకుడిగా విచ్చేశారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్, సభ్యులకు పలు సూచనలు చేశారు. పాఠశాల హెచ్ఎం లోవ కుమారి మాట్లాడుతూ కమిటీలోని ప్రతీ ఒక్కరూ పాఠశాల అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించే విషయంలో గణనీయమైన పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ చిక్కాల సత్యనారాయణ, వైస్ చైర్మన్ పి.అంజలి, సభ్యులు జి.భవాని, మురళీబాబు, లీలావతి, జ్యోతి, భగత్ సింగ్, సుజాత, వెంకటలక్ష్మి, ఉపాధ్యాయిని నబీ, తదితరులు పాల్గొన్నారు.



బ్యాంకు ఎంప్లాయిస్ సమావేశానికి హాజరైన ప్రతినిధులు

యూనియన్ బ్యాంక్ ఉద్యోగుల

ఏలూరు రీజియన్ కార్యదర్శిగా లక్ష్మణరావు

ఏలూరు కార్పొరేషన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఏపీ యూనియన్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఏలూరు రీజియన్ కార్యదర్శిగా ఎన్.లక్ష్మణరావు ఎన్నికయ్యారు. స్థానిక గిరిజన భవనంలో యూనియన్ బ్యాంకు అసోసియేషన్ వార్షిక సమావేశంలో కమిటీని ఎన్నుకున్నారు. డిప్యూటీ రీజనల్ కార్యదర్శిగా భవనరుషి, దివ్య రజని, కోశాధికారిగా ఎస్.ఉస్మాన్, అసిస్టెంట్ కార్యదర్శిగా ఎస్.చంద్రశేఖర్, 10 మంది కమిటీ సభ్యులను సమావేశం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. 300 మంది యూనియన్ ప్రతినిధులు హాజరయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు కాలే శ్రీనివాసరావు, ఏఐ బీఈఏ జనరల్ కార్యదర్శి బి.రాంబాబు, రాష్ట్ర నాయకులు బి.ఉదయకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఉద్యోగుల సమస్యలపై చర్చలు జరిపి తగు నిర్ణయాలు తీసుకున్నారు.



ఎంఈవో కార్యాలయ ఆవరణలో పీఆర్‌టీయూ డైరీని ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

కామవరపుకోటలో పీఆర్‌టీయూ డైరీ ఆవిష్కరణ

కామవరపుకోట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పీఆర్‌టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో 2025 డైరీ ఆవిష్కరించారు. ఎంఈవో కార్యాలయంలో ఉపాధ్యాయులు సోమవారం పీఆర్‌టీయూ డైరీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈవోలు డి.సుబ్బారావు, సీహెచ్.ప్రశాంతకుమార్, పీఆర్‌టీయూ ప్రతినిధులు జి.శర్మ, కేఎస్ఆర్‌కె.ప్రసాద్, పీఎస్ ఎల్‌వీ.సుందర్, పీఎస్ఏ.భానుప్రకాష్, జి.నాగేంద్రరావు, ఎం.రాంబాబు, బాలాజీ, సుధారాణి, జి.లీల, తదితరులు పాల్గొన్నారు.

మద్యం బెల్టు

కొయ్యలగూడెం నియోజకవర్గ గ్రామాల్లో జోరుగా అమ్మకాలు



కన్నాపురంలో ఒకేచోట ఏర్పాటైన మద్యం దుకాణాలు

కొయ్యలగూడెం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో బెల్టుషాపుల ద్వారా మద్యం ఏరులైపారుతుంది. నియోజకవర్గంలోని ఏడు మండలాల్లోని గ్రామాల్లో అమ్మకాలు సాగుతున్నాయి. అనధికారిక బెల్టుషాపులకు లైసెన్స్‌డ్ మద్యం దుకాణాల నుంచి మద్యాన్ని సరఫరా చేయడం బహిరంగ రహస్యం. గత ప్రభుత్వంలో కేవలం మద్యంషాపుల వద్దే మద్యం దొరికేది. సిట్టింగ్ షాపులు కూడా లేవు. ప్రస్తుం ఏర్పాటైన ప్రైవేటు మద్యం దుకాణ యజమానులు పరిమితి మించి మద్యం అమ్మకాలు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. కొయ్యలగూడెం మండలంలో ఐదు షాపులు ఉన్నాయి. కొయ్యలగూడెంలో 2, కన్నాపురం 2, బయ్యన్నగూడెంలో ఒక షాపు ఏర్పాటు చేశారు. కన్నాపురంలో ఒకేచోట రెండు దుకాణాలు ఏర్పాటు చేసి పోటాపోటీగా వ్యాపారం నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వంలో యర్రంపేటలో ఒకషాపు నిర్వహించేవారు. ప్రస్తుతం ఏ షాపు ఎక్కడా అనేది నిర్దిష్టంగా లేకపోవడంతో ఎక్కడ వ్యాపారం బాగుంటే అక్కడ యాజమానులు షాపులు ఏర్పాటు చేశారు. కన్నాపురంలో 2 షాపులు ఏర్పాటు చేయడంతో మందుబాబుల హడావుడితో తిరునాళ్ల తలపించేలా ఉంది. యర్రంపేట, రాజవరం, గంగవరం, పొంగుటూరు కుంతలగూడెం, ఆరిపాటిదిబ్బల మందుబాబులు ఇక్కడికి వచ్చి మద్యం సేవించి వెళుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. మద్యం షాపుల యాజమానులు పలు గ్రామాల్లో బెల్టుషాపుల ద్వారా విక్రయిస్తున్నా ధరలో తేడాదో కొందరు దుకాణాలకు వెళుతున్నారు. గ్రామాల్లో బెల్టుషాపులను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. మద్యం ఏరులైపారుతున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.





మర్లగూడెం రెవెన్యూ సదస్సులో భూసమస్యలపై అర్జీలు అందజేస్తున్న గిరిజనులు, పట్టాయిగూడెంలో మాట్లాడుతున్న సర్పంచ్ వెంకటేశ్వరరావు

భూసమస్యల పరిష్కార వేదికలు రెవెన్యూ సదస్సులు

బుట్టాయగూడెం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులు భూసమస్యల పరిష్కారానికి వేదికలుగా నిలుస్తున్నాయని తహసీల్దార్ వీవీ.చలపతిరావు అన్నారు. మర్లగూడెంలో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సులో పాల్గొని సదస్సుల ప్రయోజనాలను వివరించారు. సదస్సుల ద్వారా వచ్చిన వినతులను ప్రాధాన్యం ప్రకారం పరిష్కరించడం జరుగుతుందన్నారు. ప్రతి సమస్యను పరిష్కరించడం జరుగుతుందని క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత పరిష్కార చర్యలు ఉంటాయన్నారు. సాగులో ఉన్నవారి పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలంటూ గిరిజనులు తహసీల్దార్‌కు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తాతి సీత, రెవెన్యూ అధికారులు సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

● చింతలపూడి: నామవరం పంచాయతీ పట్టాయిగూడెంలో శ్మశాన భూమి ఆక్రమణకు గురైందని, సర్వే జరిపి హద్దులు నిర్ణయించాలని సర్పంచ్ జె.వెంకటేశ్వరరావు కోరారు. పరిష్కారానికి తహసీల్దార్ ప్రమద్వర సర్వేయర్‌ను ఆదేశించారు. రెవెన్యూ భూ సంబంధిత సమస్యలు, వారసత్వ హక్కులు, ఆన్‌లైన్‌కు సంబంధించిన విషయాలను దరఖాస్తుల రూపంలో ఇస్తే పరిష్కారం చేస్తామన్నారు. గ్రామంలో ఇళ్ల నిర్మాణాలు, లేఅవుట్‌లపై ఆరా తీశారు. ఎస్.గోపి, ఎస్.సత్యనారాయణ, పాములపాటి సత్యనారాయణ, ఆర్.వెంకన్నబాబు పాల్గొన్నారు.

● లింగపాలెం: మండలంలో రైతుల భూసమస్యలను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ నజీముల్లాషా అన్నారు. మఠంగూడెంలో జరిగిన రెవెన్యూ సదస్సులో భూసమస్యలపై 17 అర్జీలు రాగా 15 సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. డీటీ నాగబాబు, సర్పంచ్ పొదిల ప్రసాదరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

● కామవరపుకోట: వీరిశెట్టిగూడెం సచివాలయ ప్రాంగణంలో జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ గెడ్డం ఎలీషా వినతిపత్రాలు స్వీకరించారు. సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆర్ఐ రామకృష్ణ, గ్రామ కార్యదర్శి కె.నాగేశ్వరరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

క్రైస్తవులపై దాడులు అరికట్టాలి

ఏలూరు టూటౌన్, జనవరి6 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవులపై దాడులను అరికట్టాలని నేషనల్ దళిత జేఏసీ నేత పెరికే వర ప్రసాదరావు డిమాండ్ చేశారు. జేఏసీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ మణిపూర్‌లో శాంతిభద్రతలు కాపాడడంలో ప్రధాని మోదీ విఫలమయ్యారన్నారు. మణిపూర్‌లో గిరిజన క్రైస్తవులపై విపరీతమైన దాడులు చేయడంతో లక్షమందికి పైగా చనిపోయారన్నారు. అయినప్పటికి మోదీ మణిపూర్ వెళ్ళి పరామర్శించలేదన్నారు. ఐక్యరాజ్య సమితి జోక్యం చేసుకుని మణిపూర్‌లో శాంతి భద్రతలు కాపాడాలని డిమాండ్ చేశారు.

ఆక్రమణలు తొలగించాలి

భీమడోలు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): భీమడోలులో జాతర జరుగనున్న నేపథ్యంలో రైల్వే స్టేషన్ నుంచి సంతమార్కెట్‌కు ఇరువైపులా ఆక్రమణలు తొలగించాలని, ద్వారకా తిరుమల పుణ్యక్షేత్రానికి బస్ సౌకర్యాన్ని కల్పించాలని కోరుతూ పలువురు మీకోసం కార్యక్రమంలో అర్జీ చేశారు. తహసీల్దార్ భీమడోలు రెవెన్యూ అధికారులకు విజ్ఞాపన పత్రాన్ని సత్యనారాయణ, పైడిమాల యుగంధర్, వీరాస్వాములు అందజేశారు.

12 మంది బైండోవర్

పెదవేగి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కోడి పందేలు, పేకాట నిర్వహించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కె.రామకృష్ణ అన్నారు. మండలంలో పలుగ్రామాల్లో పేకాట, కోడిపందేల నిర్వాహకులను గుర్తించి, 12 మందిని సోమవారం బైండోవర్ చేయించారు. ఇకపై కోడిపందేలు, పేకాట, జూదాల జోలికిపోమని వారి నుంచి పూచీకత్తు తీసుకున్నారు. ఎస్ఐ మాట్లాడుతూ సంక్రాంతిని పురస్కరించుకుని కొంతమంది జూదం, కోడి పందేలకు ఏర్పాట్లు చేస్తుంటారని, అలాంటి వారిని గుర్తించి బైండోవర్ చేయిస్తున్నామని చెప్పారు. ఎవరైనా కోడిపందేలు నిర్వహిస్తే వారిపై జంతుహింస నిరోధక చట్టంకింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

● చింతలపూడి: చింతలపూడి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని గణిజర్ల, రాఘవాపురం గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు సోమవారం దాడులు చేశారు. సారా విక్రయిస్తున్న, కలిగిఉన్న మొగలి వెంకన్న, ఇ.వెంకటరమణ తహసీల్దార్ వద్ద బైండోవర్ చేసినట్టు సీఐ పి.అశోక్ తెలిపారు.



ఏలూరు నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్టీసీ అధికారులు, సిబ్బంది

ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ మాసోత్సవం

ఏలూరు క్రైం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సేవల్లో భాగంగా కార్గో డోర్ డెలివరీ మాసోత్సవం నిర్వహిస్తున్నట్లు ఏలూరు డిపో మేనేజర్ వాణి చెప్పారు. అధికారులు, సిబ్బంది కలిసి ఏలూరు నగరంలో కార్గో మాసోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. డీఎం వాణి మాట్లాడుతూ కార్గో డోర్‌డెలివరీ మాసోత్సవాలు పురస్కరించుకుని జనవరి 19 వరకు ఉచిత డోర్ డెలివరీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రయాణికులు, వారి బంధువులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు వారికి నచ్చిన పిండివంటలు, బహుమతులు, ఎటువంటి డోర్ డెలివరీ వస్తువులైనా తక్కువ ధరలతో వారికి నచ్చిన పట్టణాలకు కేవలం 24 గంటల్లో 50 కేజీల వరకూ పది కిలోమీటర్ల దూరం వరకూ డోర్ డెలివరీ నిర్వహిస్తున్నామన్నారు. ఏలూరు డిపో గ్యారేజీ నుంచి కొత్త బస్టాండ్, ఫైర్ స్టేషన్ మీదుగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంటి జి.మురళి, మెకానికల్ ఫోర్‌మెన్ ఐ.ప్రేమ్‌కుమార్, గ్యారేజీ సిబ్బంది, కార్మికులు, పీఆర్వో కెఎల్‌వి నరసింహం, తదితరులు పాల్గొన్నారు.



మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటలక్ష్మి

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

లింగపాలెం, జనవరి6 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు కృషిచెయ్యాలని ఎంపీపీ మునునూరి వెంకటలక్ష్మి అన్నారు. మండల పరిషత్ సమావేశం ఎంపీపీ వెంకటలక్ష్మి అధ్యక్షతన సోమవారం జరిగింది. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మండలంలో చేపట్టాల్సి అభివృద్ధి పనులపై చర్చించారు. పలువురు సర్పంచ్‌లు గ్రామంలో రోడ్లు, తదితర సమస్యలపై ప్రస్తావించగా ఎంపీడీవో, అధికారులు చేపట్టిన చర్యలు వివరించారు. మండలంలో డ్రైనేజీలు మరమ్మతు నిమిత్తం కోటీ 46లక్షలు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. మండలంలో 11 సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. మండలంలో విద్య, వైద్యం, తదితర శాఖల్లో చేపట్టిన పనులు, కార్యక్రమాల పురోగతి సంబంధిత అధికారులు వివరించారు. సమావేశంలో ఎంపీడీవో కందుల వాణి, తహసీల్దార్ నజీముల్లాషా, సర్పంచ్‌లు, ఎంపిటీసీలు, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో భూ సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఏలూరు కార్పొరేషన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందాలంటే భూసమస్యలన్నీ పరిష్కరించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు తెలిపారు. అమరజీవి అన్నే వెంకటేశ్వరరావు 21వ వర్థంతి సందర్భంగా సోమవారం జరిగిన భూ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సభకు అధ్యక్షత వహించిన రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి మాట్లాడుతూ ప్రభుత్వ భూములను సంపన్నులకు కట్టబెట్ట డానికే భూ ఆక్రమణల చట్టాన్ని తీసుకువచ్చారన్నారు. కిలో రెండు రూపాయల బియ్యం పథకం ప్రవేశపెట్టి 40 ఏళ్ల గడిచినా ఈ రోజుకు వాటి కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉందంటే పేదరికం ఏ మాత్రం సమసిపోలేదని అర్థమవుతుందన్నారు. ఏ పాలక పార్టీల ఎన్నికల ప్రణాళికలో భూ పంపిణీ అజెండా లేదని గుర్తు చేశారు. అమరజీవి అన్నే వెంకటేశ్వరరావు, ఆయన భార్య అనసూయమ్మ ప్రజల హక్కుల కోసం, భూసాధన కోసం అంకితం చేశారన్నారు. పాలకులు ఎందరు మారినా భూసమస్యలను పట్టించుకోవడంలేదని విమర్శిం చారు. ఇందుకు భూస్వాములు, సంపన్నులకు వ్యతిరేకమైన వారి గుప్పెట్లో ఉన్న ప్రభుత్వ భూములు లాక్కుని పేదలకు పంచి పెట్టాల్సి వస్తుందనే భూ సమస్యను పట్టించుకోవడం లేదన్నారు. ఓట్లు, సీట్లు కోసం పేదల తరపున మాట్లాడుతున్న పాలక పార్టీలన్నీ నటిస్తున్నా యన్నారు. కాని ఆచరణలో ప్రభుత్వ భూములే కాదు ఆ సంపద అంతటిని సంపన్నులు, పెత్తందారులందరికీ కట్టబెట్టాలని ప్రభుత్వాలు కోరుకుంటున్నాయన్నారు. ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి, జక్కంశెట్టి సత్యనారాయణ, పిల్లి రామకృష్ణ, ఎస్.మహంకాళిరావు, యు.వెం కటేష్, ఎం.సుధారాణి, ఎస్.సాయికృష్ణ, కారం దుర్గ, వై.సీత, కోలి మేరి, కోటేశ్వరరావు, మాధవ, రాజు, రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. తొలుత అన్నే వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఇంటర్వ్యూ..

చెరువుల్లో ఆక్రమణలు తొలగించాలి



మొరంపూడి వరప్రసాద్, సాగునీటి సంఘం అధ్యక్షుడు, ధర్మాజీగూడెం

● నీటిసంఘం అధ్యక్షుడిగా లక్ష్యాలు..?

పదవులు వచ్చినా ఉపయోగం లేదు. చెరువులు, కాలువలు మరమ్మతులకు నిధులు లేకుండా ఏం చెయ్యగలం.

● మీ పరిధిలో ఉన్న చెరువులు?

మా సంఘం పరిధిలో ఆరు చెరువులున్నాయి. తుమ్మలచెరువు, ఊరగావర చెరువు, రాపాచ చెరువు, మల్లసముద్రం, ఎర్రగుంట చెరువు, రేగుంట చెరువు. వీటిలో మల్లసముద్రంచెరువు 70 ఎకరాలకు పైగా ఆక్రమణలకు గురిఅయ్యాయి. చెరువుగట్లు దెబ్బతిన్నాయి, కాలువలన్నీ పూడిపోయాయి. అన్ని చెరువులు కాలువలు మరమ్మతులు చెయ్యాలి.

● ఎంతకాలంగా చెరువుల సమస్యలు ఉన్నాయి?

15 ఏళ్లగా ఇలాగే ఉన్నాయి. చెరువులు ఆక్రమణలకు గురైనా, చెరువుగట్లు దెబ్బతిన్నా, కాలువలు పూడికతో నిండినా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు.

● నిధుల మంజూరు..?

సాగునీటి సంఘాలు కొత్తగా ఏర్పడ్డాయి. చెరువులను అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ సహకారంతో రాష్ట్రప్రభుత్వం, జలవనరుల శాఖ మంత్రుల దృషికి తీసుకువెళతాం. చెరువు ఆక్రమణలు తొలగించాలని కోరతాం.

● రైతులతో సమన్వయం..?

గత ప్రభుత్వం రైతులకు అవసరమైన సాగునీటి చెరువులు, కాలువల అభివృధికి నిధులు మంజూరు చెయ్యలేదు. రైతులను పట్టించుకోలేదు. రైతులంతా కలిసి చెరువులన్నీ అభివృద్ధి చేసుకుంటాం.

శ్రీవారి తిరువీధి సేవ

ద్వారకాతిరుమల, జనవరి 6(ఆంధ్రజ్యోతి): శ్రీవారి తిరువీధి సేవ నయనానందకరంగా జరిగింది. ధనుర్మాస పర్వదినాలను పురస్కరించుకుని శ్రీవారు, ఉభయ దేవేరులు, గోదాదేవితో కలసి పురవీధుల్లో అట్టహాసంగా ఊరేగారు. ధనుర్మాస మండపంలో కొలువైన శ్రీవారు, అమ్మవార్లకు దను ర్మాస ఉత్సవం సోమవారం రమణీయంగా జరిగింది. తరువాత మండపంలో కొలువుతీరి భక్తులను కటాక్షించారు. అర్చకులు పూజలు జరిపి హారతులిచ్చారు. ఆతరువాత భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.

లక్ష్మీనరసింహుని హుండీ ఆదాయం రూ.2.78 లక్షలు

ద్వారకాతిరుమల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సుందరగిరిపై కొలువుదీరిన ఐఎస్ జగన్నాధపురం లక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీ ఆదాయం సోమవారం లెక్కించారు. రూ.2,78,288 ఆదాయం లభించినట్టు ఆలయ ఇన్‌చార్జ్ ఈవో వేండ్ర త్రినాథరావు తెలిపారు.

వెదురు తరలిస్తున్న ట్రాక్టరును పట్టుకున్న అటవీ అధికారులు

జీలుగుమిల్లి, జనవరి, 6 (ఆంధ్రజ్యోతి): పి.రాజవరం సమీప అడవి నుంచి వెదురు (ముల్లు కర్రలు) తరలిస్తున్న ట్రాక్టరును అటవీ అధికారులు పట్టుకున్నారు. ఆదివారం రాత్రి సమయంలో గస్తీ తిరుగుతున్న ఫారెస్టు అధికారులు ట్రాక్టరును గుర్తించారు. పొగాకు బ్యారన్‌లో ఉపయోగించే ముల్లు కర్రలు సుమారు వెయ్యి వరకు ఉన్నట్లు గుర్తించారు. జంగారెడ్డిగూడెం రేంజ్ కార్యాలయానికి ట్రాక్టరును తరలించారు. సీతంపేటకు చెందిన చెన్ను లక్షణరావుపై కేసు నమోదు చేశారు. డిప్యూటీ రేంజ్ అధికారి పి.ధర్మారావు, ఎఫ్‌బీవో జి.మారేష్, రహ్మాద్ ఉన్నారు.

పీసా గ్రామసభలపై ప్రచారం

బుట్టాయగూడెం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ మండలాల్లో ఈ నెల 7 నుంచి 10 వరకు జరుగుతున్న పీసా గ్రామసభల ఎన్నికలపై సోమవారం దొరమామిడిలో కార్యదర్శి కె.కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది విస్తృత ప్రచారం చేశారు. ఓటు ఉన్న ప్రతిఒక్కరూ గ్రామసభ ఎన్నికల్లో వినియోగించుకోవాలని కార్యదర్శి కోరారు. పీసా గ్రామసభల్లో ఉపాధ్యక్షుడు, కార్యదర్శి పదవులకు ఎన్నికలు జరుగుతున్నాయని ఎన్నికల్లో పాల్గొని పంచాయతీల అభివృద్ధికి సహకారం అందించాలన్నారు. ప్రచారాన్ని ఎంపీడీవో కె.జ్యోతి పరిశీలించారు.

మండలం యూనిట్‌గా పరిహారం చెల్లించాలి

కుక్కునూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలం యూనిట్‌గా తీసుకుని ఆర్ అండ్ ఆర్ పరిహారం ఇవ్వాలని సీపీఐ మండల కమిటీ కార్యదర్శి ఎం.వెంకటాచారి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏటా వరద ముంపు దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం మండలం మొత్తాన్ని యూనిట్‌గా తీసుకోవాలన్నారు. 2015లో టీడీపీ ప్రభుత్వం రూ.6.36 లక్షల ప్యాకేజీ ప్రకటించిందన్నారు. గత జగన్ ప్రభుత్వం రూ.10 లక్షల ప్యాకేజీ ఇస్తానని చెప్పి ఇవ్వలేదన్నారు. 18ఏళ్ల నిండిన ప్రతీ ఒక్కరికి పరిహారం ఇవ్వాలని, నిర్వాసిత కుటుంబంలో ఒకరి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా సమితి సభ్యులు లక్ష్మయ్య, కే.బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

నిడమర్రు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎస్‌టీయూ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు సోమవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కేవీఎన్. మల్లేశ్వరరావు, ముత్యాల మురళీకృష్ణ, హెచ్ఎం కె.కృష్ణకుమార్, ముత్యాల కాశీవిశ్వనాథం, బొబ్బిలి గంగాధర్ పాల్గొన్నారు.

సంక్రాంతికి మరో నాలుగు రైళ్లు



ఏలూరు క్రైం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రయాణికుల రద్దీ దృష్ట్యా విజయవాడ దక్షిణమధ్య రైల్వే శాఖ అధికారులు మరో నాలుగు రైళ్లను ఏలూరు మీదుగా నడపడానికి సోమ వారం చర్యలు చేపట్టారు. రైల్ నెంబర్ 07615 కాచిగూడ, శ్రీకాకుళం రోడ్డు ఈనెల 11, 15 తేదీలలో నడుస్తుంది. రైల్ నెంబర్ 07616 శ్రీకాకుళం రోడ్డు-కాచిగూడ ఈనెల 12, 16 తేదీలలో నడుస్తుంది. రైల్ నెంబర్ 07617 చర్లపల్లి - శ్రీకాకుళం రోడ్డు ఈనెల 8వ తేదీన, 07618 శ్రీకాకుళం రోడ్డు-చర్లపల్లి రోడ్డు ఈనెల 9వ తేదీన నడుస్తుంది. ఈరైళ్ళు మల్కాజ్‌గిరి, చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి, పొందూరు, స్టేషన్లలో ఆగనున్నాయి.

రైళ్ల సమయం మార్పు

రైల్‌నెంబర్ 17206 కాకినాడ పోర్టు - షిర్డిసాయినగర్ రైలు ఈనెల 1 నుంచి ప్రయాణ సమయం మార్పు జరిగిందని ప్రయాణికులు గమనించాలన్నారు. ఇప్పటికే రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణికులు రైల్వే ఎంక్వైరీ ద్వారా సమాచారం పొందాలన్నారు. పాత సమాచారం ప్రకారం కాకినాడ పోర్టులో ఉదయం 6 గంటలకు బయలుదేరాల్సి ఉండగా కొత్త సమయం ప్రకారం ఉదయం 5.05 గంటలకు బయలుదేరుతుందన్నారు. ఏలూరులో ఉదయం 8.45 గంటలకు గతంలో వచ్చేదని ఇప్పుడు ఉదయం 7.30 గంటలకే వస్తుందని తెలిపారు. అన్ని స్టేషన్లలో ఇదేవిధంగా సమయం మార్పు చేయడం జరిగిందన్నారు.

దేహదారుఢ్య పరీక్షల్లో 253 మంది అర్హత



లాంగ్ జంప్ చేస్తున్న అభ్యర్థి

ఏలూరు క్రైం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కానిస్టేబుళ్ళ రిక్రూట్‌మెంట్‌లో భాగంగా సోమవారం 600 మంది అభ్యర్థులు హాజరు కావాలని హాల్‌టిక్కెట్లు జారీ చేశారు. వీరిలో 396 మంది హాజరు కాగా వారికి 1600 మీటర్ల పరుగుపందెం, లాంగ్‌జంప్, పలు ఈవెంట్స్‌ను నిర్వహించారు. వీటి లో 253 మంది అర్హత సాధించారు. ఏలూరు జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ పర్యవేక్షణలో ఈ దేహదారుఢ్య పరీక్షలు అభ్యర్థులకు నిర్వహించారు. అభ్యర్థులకు ఇచ్చిన తేదీలో హాజరు కాలేక అప్పీలు చేసుకున్న అభ్యర్థులు ఈనెల 9వ తేదీన నిర్వహించే దేహదారుఢ్య పరీక్షలకు హాజరు కావాలని ఎస్పీ సూచించారు.

ఇద్దరు అభ్యర్థులకు అస్వస్థత

పోలీస్ కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్‌లో భాగంగా దేహదారుఢ్య పరీక్షలకు హాజరైన కొయ్యలగూడెం మండలం అచ్యుతాపురానికి చెందిన టి.మధు అస్వస్థతకు గురయ్యాడు. మధు 1600 మీటర్ల పరుగుపందాన్ని సోమవారం ఉదయం విజయం సాధించి అనంతరం అస్వస్థతకు గురికావడంతో వైద్య పరీక్షలు నిర్వహించారు. అతనితో పాటు మరో అభ్యర్థి కూడా అస్వస్థతకు గురి కావడంతో అక్కడ ఉన్న ప్రత్యేక వైద్యుల బృందం వైద్య పరీక్షలు నిర్వహించి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి అత్యవసర విభాగంలో ఉన్న దుర్గాకుమార్ వైద్య పరీక్షలు నిర్వహించారు. అభ్యర్థి మధు ఆహారం తీసుకోకపోవడం వల్ల నీరసించి అస్వస్థతకు గురయ్యాడని వైద్యులు నిర్ధారించారు. అతనికి సెలైన్లు ఎక్కించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పురుగు మందు తాగి తీవ్ర అస్వస్థతకు గురై ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఒక వ్యక్తి మృతి చెందాడు. జంగారెడ్డిగూడెంలోని బైపాస్ దగ్గర రాజీవ్‌నగర్‌కు చెందిన లింగాల శ్రీను (43) ఈనెల 5న ఇంటి వద్ద పురుగు మందు తాగాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతడిని ఏలూరు ప్రభుత్వా సుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీ నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. జంగారెడ్డిగూడెం పోలీసులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి వచ్చి పోస్టుమార్టం జరిపి బంధువులకు మృతదేహం అప్పగించారు. అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ముదినేపల్లిలో దళితుల హక్కుల పరిరక్షణ కమిటీ సమావేశంలో పాల్గొన్న నాయకులు

మండల స్థాయి ఆదర్శ దళిత కమిటీ ఏర్పాటు

ముదినేపల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు చెందిన దళిత సంఘాల నాయకులు ముదినేపల్లిలో సోమవారం సమావేశం నిర్వ హించి మండల ఆదర్శ దళిత కమిటీ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ గౌరవా ధ్యక్షుడిగా రాకారపు నాగమల్లేశ్వరరావు, అధ్యక్షు డిగా నిమ్మగడ్డ భిక్షాలు, ఉపాధ్యక్షులుగా బేత పూడి వెంకటరమణ, లేళ్ల ఆంజనేయులు, సాయినపూడి సుధాకర్, దాసి రంగారావు, పుట్టి నరసింహారావు, కార్యదర్శిగా పాగోలు విజయ సాగర్, కోశాధికారిగా గోరుముచ్చు సామియేలుతోపాటు గౌరవ సలహాదారులు, సంయుక్త కార్యదర్శులను ఎన్నుకున్నారు.



సచివాలయంలో కంప్యూటర్ రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీడీవో ఫణీంద్ర

రికార్డులు సక్రమంగా నమోదు చేయాలి : ఎంపీడీవో

కైకలూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాల్లో రికార్డులను సక్రమంగా నమోదు చేయాలని ఎంపీడీవో ఆర్ ఫణీంద్ర అన్నారు. సోమవారం కైకలూరు-2 సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. సచివాలయ సిబ్బంది ప్రతీ రోజూ క్రమం తప్పకుండా విధులు సక్రమంగా నిర్వహించాలని, సమయపాలన పాటించాలని సూచించారు.

భూ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ : తహసీల్దార్

ముదినేపల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారంలో రెవెన్యూ శాఖ ప్రత్యేక శ్రద్ధ చూపిస్తోందని, ప్రభుత్వం ఈ విషయంలో స్పష్టమైన వైఖరితో ఉందని తహసీల్దార్ సుభానీ తెలిపారు. ఈడేపల్లి, అల్లూరుల్లో సోమవారం రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. జాయింట్ ఎల్‌పీల ఇబ్బందులపై, భూ విస్తీర్ణం సవరణలు తదితర అంశాలకు సంబంధించి రైతుల నుంచి అర్జీలు అందాయి. మండల ప్రత్యేక అధికారి పి.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతీ అర్జీని పరిశీలించి సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామన్నారు. సర్పంచ్ అబ్బిశెట్టి వెంకటేశ్వరరావు, న్యాయవాది బండారు అయ్యప్ప, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగరాజు, వీఆర్వో శ్రీరాములు పాల్గొన్నారు.

కోడిపందేలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు

కలిదిండి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పురస్కరించుకుని కోడిపందేలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం కలిదిండితో పాటు పలు గ్రామాల్లో జూద క్రీడలపై అవగాహన సదస్సులు నిర్వహిం చారు. పోలీసు సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పుల్లపర్రులో..

మండవల్లి : సంక్రాంతి సమీపిస్తున్న దృష్ట్యా గ్రామాల్లో శాంతి భద్రతలకు ఎలాంటి భంగం కలగకుండా కోడిపందేలు జూదం ఆటలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ సీహెచ్ రామచంద్రరావు పేర్కొన్నారు. పుల్లపర్రులో సోమవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన సూచనలు, సలహాలు ఇచ్చారు.

వైవాకలో అసైన్డ్ భూములపై విచారణ

ముదినేపల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ముదినేపల్లి మండలం వైవాక రెవెన్యూ గ్రామ పరిధిలోని నిషేధిత జాబితాలో చేర్చిన అసైన్డ్ భూముల సమస్యలను పరిశీలించేందుకు సోమవారం రెవెన్యూ శాఖ అధికారులు ప్రత్యేకంగా గ్రామసభను నిర్వహించారు. ఆ గ్రామ ఏరియాలోని 667 ఎకరాల అసైన్డ్ భూములను స్వాతంత్ర్య సమరయోధులకు గతంలో పట్టాలు ఇవ్వగా, వాటిలో 120 ఎకరాల భూములకు సంబంధించి విచారణకు తహసీల్దార్ సుభానీ, పెదపాడు తహసీల్దార్ కృష్ణజ్యోతి గ్రామసభను నిర్వహించగా అసైన్డ్ భూములు తమవేనంటూ 99 మంది అర్జీలు దాఖలు చేశారు. పూర్తిస్థాయిలో అర్జీలు అందాక పరిశీలించిన అనంతరం నివేదికను ఉన్నతాధి కారులకు అందజేస్తామని తహసీల్దార్ తెలిపారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొత్త నాగేంద్ర కుమార్, గురుముచ్చు శశి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వైవాక అసైన్డ్ భూముల గ్రామసభలో అర్జీలను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

22ఏ నిషేధిత జాబితాల్లోని అర్హుల భూముల తొలగింపునకు చర్యలు

కలిదిండి : 22ఏ నిషేధిత జాబితాల్లోని అర్హుల భూముల తొలగించేందుకు చర్యలు చేపడుతున్నామని ప్రత్యేకాధికారులు బి.రమాదేవి, ఎ.శ్రీనివాస రావు తెలిపారు. కలిదిండి మార్కెట్ యార్డు ఆవరణలో సోమవారం రైతుల నుంచి అర్జీలు స్వీకరణకు ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. కలిదిండి, లోడిదలంక, సంతోషపురం గ్రామాల్లో మిలటరీ భూమి 1,899 ఎకరాలు, మద్దాల శ్రీ రంగనాయకుల భూమి 496 ఎకరాలు, భాస్కరావుపేటలో 179 ఎకరాలు, గుర్వాయిపాలెంలో 70 ఎకరాలు 22ఏ నిషేధిత జాబితాలో ఉన్నాయని, వాటిపై అర్హుల నుంచి అర్జీలు స్వీకరించి విచారణ జరిపి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామన్నారు. తహసీల్దార్ రామకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు జోగిరాజు, సొసైటీ మాజీ అధ్యక్షులు యార్లగడ్డ రవికుమార్, చిట్టూరి రవీంద్ర, నీటి సంఘాల అధ్యక్షులు, వీఆర్వోలు పాల్గొన్నారు.



కలిదిండి సభలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి రమాదేవి

యువతి పట్ల అసభ్య ప్రవర్తన.. ఆపై బస్సుపై దాడి

ముదినేపల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో ఒక యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించడమే కాక ఆ బస్సును అడ్డగించి రాళ్లతో బస్సు అద్దాలను పగులకొట్టిన ఘటన కొత్తపల్లి సెంటర్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం బంటుమిల్లి నుంచి గుడివాడ వెళుతున్న ఆర్టీసీ బస్సులో ఆదివారం రాత్రి కొత్తపల్లికి చెందిన ఒక యువతి ఎక్కింది. ఆమె వెనుకే ఎం.ఏసుబాబు అనే యువకుడు బస్సు ఎక్కి ఆ యువతి పక్కనే కూర్చుని అసభ్యంగా ప్రవర్తిస్తూ ప్రేమిస్తున్నానంటూ ఫోన్ నెంబరు ఇవ్వాలంటూ ఒత్తిడి చేశాడు. ఆ యువతి కండక్టర్‌కు చెప్పడమే కాక తన తల్లికి ఫోన్ చేసి చెప్పింది. బస్సు కొత్తపల్లి వచ్చేసరికి ఆమె తల్లి అక్కడికి చేరుకుని ఏసుబాబును నిలదీయడంతో అతడు బస్సును వెళ్లనీయకుండా దుంగను అడ్డంగా పెట్టి రాయితో బస్సు అద్దాన్ని పగులకొట్టాడు. ఈ ఘటనపై బస్సు డ్రైవర్ ఎం.వెంకారెడ్డి సోమవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్‌ఐ పద్మజ తెలిపారు.

8 నుంచి జగన్నాథస్వామి దేవస్థానంలో ధనుర్మాస పూజలు

ముదినేపల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): వడాలిలోని సుభద్ర బలరామ సహిత జగన్నాథస్వామి దేవస్థానం ధనుర్మాస ఉత్సవాలకు ముస్తాబైంది. ఈనెల 8 నుంచి 14 వరకు జరగనున్న కార్యక్రమాలకు దేవస్థానంలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 8న లక్ష తులసీ పూజ, 10న వైకుంఠ ఏకాదశి, ఉత్తర ద్వార దర్శనం (ముక్కోటి ఏకాదశి), స్వామివార్ల గ్రామోత్సవం, 12న మహిళలకు సంక్రాంతి ముగ్గుల పోటీలు, 13న భోగి సందర్భంగా గోదాదేవి కల్యాణం, 14న మకర సంక్రాంతి పండుగ వేడుకలు, గ్రామోత్సవం నిర్వహించనున్నట్టు ఈవో సింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు.



మండవల్లి గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ మెండా ఝాన్సీ

గ్రామసభలో తీర్మానించిన పనులు ఎక్కడ..?

మండవల్లి జనవరి 6(ఆంధ్రజ్యోతి): గ్రామసభలో తీర్మానించిన పనులకు ప్రాధాన్యత ఇవ్వకుండా, ఇష్టానుసారంగా పనులు ఎంపిక చేసుకుని నిర్వహించడంపై పలువురు గ్రామస్థులు గ్రామసభలో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండవల్లి పంచాయతీ గ్రామసభ సమావేశం సోమవారం సర్పంచ్ మెండా ఝాన్సీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇన్‌చార్జి కార్యదర్శి ప్రదీప్, ఈవోపీఆర్‌డీ శేఖర్, ఏపీవో నవీన్, మెడికల్ ఆఫీసర్ పవిత్ర, పశుసంవర్థక శాఖ ఏడీ వరప్రసాద్, హౌసింగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎలక్ట్రికల్ జేఈ సత్యనారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగలక్ష్మి, పలు పాఠశాలల హెచ్‌ఎంలు, డ్వాక్రా సంఘాలు, పీహెచ్‌సీ సిబ్బంది, పలు శాఖల అధికారులు, నలుగురు వార్డు నెంబర్లు పాల్గొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్‌ఎస్ భాస్కరరావు, జిల్లా కన్వీనర్ టి.అప్పారావు సభలో మాట్లాడుతూ గత గ్రామసభలో చేసిన ఎన్ని తీర్మానాలను పరిష్కరించారని ప్రశ్నించగా, తనకు తెలియదు గ్రామసభ మినిట్స్ బుక్ గత కార్యదర్శి తనకు అప్పగించలేదని ఇన్‌చార్జి కార్యదర్శి సమాధానం ఇవ్వడంపై పలువురు అభ్యంతరం తెలిపారు. జలజీవన్ మిషన్ ద్వారా ఇచ్చిన కుళాయి కనెక్షన్లకు ఎప్పుడు తాగునీరు అందిస్తారని అని అడగగా తనకు తెలియదన్నారు. తరుగుమూల ఇళ్ల స్థలాలను మెరక చేసి మౌలిక వసతులు కల్పించాలని, ఒరిజినల్ పట్టాలు ఇప్పించాలని బుద్దులు రాముడు అధికారులను వేడుకున్నారు.



క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ జయమంగళ, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి

పోలీసుల ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్

కైకలూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో సంప్రదాయ క్రీడల పట్ల యువత మక్కువ చూపాలని జూదాల వైపు వెళ్తే అమూల్యమైన భవిష్యత్తు కోల్పోవాల్సి వస్తుందని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, టౌన్, రూరల్ సీఐలు పి.కృష్ణ, వి.రవికుమార్, ఎస్సై వెంకటకుమార్, ప్రిన్సిపాల్ శ్రీలత, కూటమి నాయకులు బికెఎం నాని, పూల రామచంద్రరావు, పీజెఎస్ మాల్యాద్రి, కొల్లి బాబి, ఎండీ జానీ పాల్గొన్నారు.

మత్స్యకారులకు అండగా ఉంటా..

ఎమ్మెల్సీ జయమంగళ

ముదినేపల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మత్స్యకార సంక్షేమానికి, కుల వృత్తుల ప్రోత్సాహానికి శాయశక్తులా కృషి చేస్తానని శాసనమండలి సభ్యుడు, జనసేన నాయకుడు జయమంగళ వెంకట రమణ తెలిపారు. అల్లూరులో సోమవారం జరిగిన స్థానిక ఫిషర్‌మెన్ కో-ఆపరేటివ్ సొసైటీ నూతన పాలకవర్గ అభినందన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సొసైటీ అధ్యక్షుడు పత్తి సోమేశ్వరరావు, ఉపాధ్యక్షులు నత్తా ఏసుబాబుతోపాటు సభ్యులను ఎమ్మెల్సీ సత్కరించి అభినందించారు. సొసైటీ తరఫున ఎమ్మెల్సీని సన్మానించారు. సర్పంచ్ రామకృష్ణ, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు నాగరాజు, సొసైటీ మాజీ అధ్యక్షులు కృష్ణారావు, రాము, ఎఫ్‌డీవో సతీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలను తగ్గించాలి

కలిదిండి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలను తగ్గించి స్మార్ట్ మీటర్లను నిలుపుదల చేయాలని కోరుతూ సీపీఎం నాయకులు సానారుద్రవరంలో సోమవారం ధర్నా నిర్వహించి విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. సీపీఎం నాయకులు సిహెచ్.శ్రీకాంత్, బి.సురేష్, ఎ.శేఖర్, డి.రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే యార్లగడ్డ వ్యాఖ్యలు నిరాధారం

చాట్రాయి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నూజివీడు నియోజకవర్గంలో అక్రమ మైనింగ్ జరుగుతుందంటూ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చేసిన వ్యాఖ్యలు నిరాధారమని టీడీపీ నాయకులు ఖండించారు. చాట్రాయిలో మాజీ ఎంపీటీసీ అంబటి సత్యనారాయణ(చంటి), పెద్ద చెరువు నీటి సంఘం అధ్యక్షుడు తుమ్మల చిన్న సాంబశివరావు, రాయవరపు పుల్లారావు సోమవారం విలేకరులతో మాట్లాడారు. యార్లగడ్డ తనకు తెలిసిన సమాచారాన్ని ధ్రువీకరించుకోకుండా మాట్లాడడం తొందరపాటు చర్య అన్నారు. అవగాహన లేకుండా చేసిన వ్యాఖ్యల వలన నియోజకవర్గ కూటమి శ్రేణుల మనోభావాలు దెబ్బతిన్నాయని, యార్లగడ్డ తన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని టీడీపీ నాయకులు కోరారు. కమ్ముల కొండలరావు, శ్రీరాముల సత్యనారాయణ, రామకృష్ణ, పాల్గొన్నారు.

బీజేపీ పట్టణ అధ్యక్షురాలిగా నాగమణి ఎన్నిక ఏకగ్రీవం

నూజివీడు టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): బీజేపీ పట్టణ అధ్యక్షురాలిగా మల్లిపూడి నాగమణి ఎన్నికయ్యారు. బోను అప్పారావు అధ్యక్షతన పోలింగ్‌బూత్ అధ్యక్షులు, క్రియాశీలక సభ్యుల సమావేశం సోమవారం జరిగింది. ఎన్నికల అధికారి కోటప్రోలు కృష్ణ ఎన్నిక నిర్వహించగా నాగమణి ఒక్కరే నామినేషన్ వేయగా ఎన్నిక ఏకగ్రీవమైంది. సమావేశంలో సీనియర్ నాయకులు వై.ఎస్ దొరై, ఎం.రాజశేఖర్, మాటూరి రవికాంత్, శివరాజు వసుంధరాదేవి, మాగంటి వాసు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నూజివీడు టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హాల్లో ఏపీ ఎస్.జి విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం, సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 2025 క్యాలెండర్‌ను సంఘ అధ్యక్షులు బీఎమ్ సింగ్, పలగాని పిచ్చియ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బండారు సత్యనారాయణ, సహ అధ్యక్షులు ఆర్.సాంబయ్య, ఉపాధ్యక్షులు స్టాలిన్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

15 లీటర్ల సారా స్వాధీనం

చాట్రాయి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): చిన్నంపేటలో ఎక్సైజ్ సిబ్బంది సోమవారం జరిపిన దాడిలో 15 లీటర్ల సారా, బైక్‌ను స్వాధీనం చేసుకొన్నారు. నిందితుడు ధారావతు సోమరాజును అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు. సారా సరఫరా చేసిన పోతనపల్లి చిన్న తండాకు చెందిన బాణావతు బాలుపై కూడా కేసు నమోదు చేశామన్నారు. సారా విక్రయాలపై సమాచారం ఇవ్వాలన్నారు.

సొసైటీ కమిటీల ఎంపికపై కసరత్తు



ముసునూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): సొసైటీలకు త్రిసభ్య కమిటీల నియామకం జరుగనున్న నేపథ్యంలో టీడీపీ నాయకులు సభ్యుల ఎంపికపై కసరత్తు ముమ్మరం చేశారు. టీడీపీ మండల, గ్రామ అధ్యక్షులకు మంత్రి కొలుసు పార్థసారథి ఈ బాధ్యతలను అప్పగించారు. ఆశావహులు ఎక్కువగా ఉండడంతో ముఖ్య నాయకులు సమావేశాలు నిర్వహించి, ఏకాభిప్రాయానికి ప్రయత్నాలు చేస్తున్నారు. మండలంలో 8 సహకార సంఘాలు ఉన్నాయి. చైర్మన్ పదవి కోసం తీవ్ర పోటీ నెలకొంది. ముసునూరు సొసైటీ చైర్మన్ పదవి బీసీకి కేటాయించినట్లు సమాచారం. ఈ పదవి కోసం ముగ్గురు పోటీ పడుతున్నారు. గతంలో కూడా బీసీ వ్యక్తి చెర్మన్‌గా ఉండటంతో ఈసారి ఎస్సీలకు ఇవ్వాలని డిమాండ్ తెరపైకి వచ్చింది. విద్యాధికులు చెర్మన్‌గా ఉండాలనే అభిప్రాయం సొసైటీ సభ్యుల్లో వ్యక్తమవుతోంది. చెక్కపల్లి సొసైటీకి ప్రస్తుత గ్రామపార్టీ అధ్యక్షులు, మాజీ జడ్పీటీసీలు పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది. చింతపల్లి సొసైటీకి జనసేన, టీడీపీ నాయకుల మధ్య పోటీ ఉంది. గోపవరం సొసైటీ త్రిసభ్య కమిటీ ఎంపిక కొలిక్కి వచ్చినట్లు సమాచారం. కాట్రేనిపాడు సొసైటీకి ఇద్దరి మధ్య పోటీ నెలకొంది. కొర్లకుంట సొసైటీకి కూడా ఇద్దరు నాయకులు పోటీ పడుతున్నారు. రమణక్కపేట సొసైటీకి జనసేన, టీడీపీ నాయకులు మధ్య పోటీ నెలకొంది. వలసపల్లి సొసైటీ చైర్మన్ పదవికోసం వలసపల్లి, గుడిపాడు టీడీపీ నాయకులు పోటీ పడుతున్నారు. పోటీ పడుతున్న నాయకుల మధ్య ఎలాంటి అసంతృప్తి లేకుండా ఏకాభిప్రామంలో చైర్మెన్, ఇద్దురు డైరెక్టర్లతో త్రిసభ్య కమిటీ సభ్యులను ఎంపిక చేసేందుకు పార్టీ మండల అధ్యక్షుడు దేవినేని బలరాం గ్రామ ముఖ్య నాయకులు, ఆశావహులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. మండలంలో సొసైటీల చైర్మన్‌ల ఎంపిక టీడీపీ ముఖ్య నాయకులకు కత్తిమీద సాములా మారింది.

మర్రిబంధంలో పోలీస్ అవుట్‌పోస్ట్ ఏర్పాటు చేయండి



అవుట్‌పోస్ట్ ఏర్పాటు చేయాలని కోరుతున్న గ్రామస్తులు

నూజివీడు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మర్రిబంధం గ్రామంలో సస్పెండ్ అయిన బ్యాంకు ఉద్యోగి కారణంగా ఉద్రిక్తలు ఏర్పడుతున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో పోలీస్ అవుట్‌పోస్ట్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ జిల్లా ఎస్పీకి గ్రామస్తులు సోమవారం వినతిపత్రాన్ని అందించారు. ఇటీవల బ్యాంకు ఉద్యోగిని వారి కుటుంబ సభ్యుల దాడి కారణంగా దోనవల్లి వెంకట్రావు తీవ్ర గాయాల పాలయ్యాడని, వారివల్ల గ్రామంలో శాంతిభద్రతలకు భంగం కలుగుతోందన్నారు. గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేయడంతో పాటు వారిని బైండోవర్ చేయాలని కోరుతూ పలువురు గ్రామస్తులు ఎస్పీకి వినతిపత్రాన్ని అందించారు.

12 అర్జీలు

నూజివీడు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నిర్వ హించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో 12 అర్జీలు దాఖలైనట్లు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ తెలిపారు. మిట్టగూడెం గ్రామానికి చెందిన పల్లెపాం సీతమ్మ వితంతు పింఛన్, నూజివీడు పట్టణానికి చెందిన విజయ్‌కుమార్, కోటవారిపేటలో మున్సిపాల్టీ భూమి ఆక్రమణపై సబ్ కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఆక్రమణను తొలగించి సదరు స్థలంలో భవనాలను నిర్మించవచ్చని ఆయన కోరారు.

విద్యుదాఘాతంతో ఒకరికి తీవ్ర అస్వస్థత

నూజివీడు టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రైవేట్ పాఠశాల ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న హోటల్ కూలీ విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడ్డాడు. నిర్మాణంలో ఉన్న హోటల్లో ఎమ్మార్ అప్పారావు కాలనీకి చెందిన పందిరిపల్లి శివ సోమవారం కూలి పనికి వెళ్లాడు. ఒక్కసారిగా విద్యుదాఘాతానికి గురికావడంతో తీవ్రంగా గాయాల పాలయ్యాడు. అతడనికి చికిత్స నిమిత్తం నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడి నుంచి మెరుగైన చికిత్సనిమిత్తం విజయవాడ ఆస్పత్రికి తరలించారు.

ఇంటర్వ్యూ..

వేంపాడు మేజర్ కాలువ అభివృద్ధికి కృషి



రాపర్ల బాలకృష్ణ, చైర్మన్ వేంపాడు మేజర్ డీసీ

- **డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా మీరు చేపట్టే చర్యలు ?**

నాగార్జునసాగర్ ఎడమ కాలువ (వేంపాడు మేజర్) అభివృద్ధితోపాటు సబ్ మైనర్ కాలువలను సైతం మెరుగు పరిచేందుకు కృషి చేస్తా. రైతులు నాకు ఇచ్చిన ఈ పదవికి న్యాయం చేస్తా.

- **మీ పరిధిలో మైనర్, సబ్ మైనర్ కాలువల పరిస్థితి ఏమిటి ?**

ముసునూరు డీసీ పరిధిలో మేజర్, మైనర్ కాలువలు గత ఐదేళ్లుగా అభివృద్ధికి నోచుకోలేదు. ముళ్ళకంచెలు, పిచ్చిమొక్కలు పెరిగిపోయి, నీరు ముందుకు కదిలే పరిస్థితి లేదు.

- **ప్రధాన సమస్యలు ఏమిటి?**

మేజర్ కాలువలో ఉన్న యూటీలకు పెద్ద రంధ్రాలు ఉన్నాయి. కాట్రేనిపాడు మైనర్ కాలువలో సూమారు 250మీటర్లు పొడవున తొవ్వాల్సి ఉంది. దీని వల్ల దిగువన ఐదు గ్రామాల చెరువులకు నీరు వెళ్లే పరిస్థితి లేదు.

- **నిధుల కోసం చర్యలు?**

మేజర్, మైనర్ కాలువలు అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు రూపొందిస్తాం. మంత్రి కొలుసు పార్థసారథి సహకారంతో ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టి, సమస్యను పరిష్కరిస్తా.

ముసునూరు, ఆంధ్రజ్యోతి

కళాశాలలో సంక్రాంతి సంబరాలు

నూజివీడు టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సిద్దార్థ విద్యా సంస్థల ఆధ్వర్యంలో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా సిద్దార్థ జూనియర్ కళాశాలలో సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ముత్యాల ముగ్గులు తీర్చిదిద్ది పలువుర్ని విశేషంగా ఆకట్టుకున్నారు. దీంతో పాటు విద్యార్థులు పంచకట్టు, విద్యార్థినిలు పల్లెపడుచుల వేషధారణలో పలువుర్ని విశేషంగా ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ఎం.మధురిమ, వై.హారిక, గీతాసుధాశ్రీలు వరుసగా మూడుస్థానాల్లో నిలిచారు.